ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 30 సెప్టెంబరు 2025

ఓపెన్ స్కూల్ దరఖాస్తుకు గడువు పెంపు



● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో 2025-26 సంవత్సరానికి ప్రవేశాలకు అక్టోబరు 31వ తేదీ వరకు 200 రూపాయల అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు పదో తరగతిలో ప్రవేశం పొందవచ్చని, అలాగే 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందవచ్చునన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశం పొందిన వారు సెలవు దినాల్లో నిర్వహించ తరగతులకు హాజరు కావాలన్నారు. రెగ్యులర్ కోర్సు ద్వారా వచ్చే సర్టిఫికెట్స్‌కు ఎంత విలువ ఉంటుందో ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్స్‌కు కూడా అంతే విలువ ఉంటుందన్నారు. వీటి ద్వారా పొందిన సర్టిఫికెట్స్‌తో డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందవచ్చునని జిల్లా ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు తెలిపారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని, ఫిర్యాదులను వందశాతం పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామానికి చెందిన సుకన్య తనకు ఎన్టీఆర్ హౌసింగ్ ఇంటి పథకం కింద స్థలం మంజూరైందని, ఇల్లు కట్టుకోవడానికి నగదు అందేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించుకుంది. గాలివీడు మండలం నూలివీడు గ్రామానికి చెందిన కాంతమ్మ తన భర్త చనిపోయాడని తనకు పింఛన్ ఇప్పించాలని కోరింది.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి : ఎస్పీ



ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లడుతూ జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించి ప్రజలకు సత్వర న్యాయం అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నడవలేని స్థితిలో ఉన్న బాధితుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లయ్యకొండ



ప్రత్యేక అలంకరణలో ఏనుగు మల్లమ్మ అమ్మవారు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ సోమవారం అశేషంగా తరలివచ్చిన భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. దసరా సెలవులు కావడంతో పెద్దఎత్తున మల్లయ్యకొండకు వచ్చి భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప మల్లికార్జున స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే కొండ పైన గౌరమ్మ అమ్మవారిని, ఏనుగు మల్లమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మునిరాజ ఆధ్వర్యంలో కొండ పైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయండి

● డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) అభివృద్ధికి పాలకవర్గంతో పాటు సిబ్బంది ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంస్థ చైర్మన్ జయప్రకాశ్ అన్నారు. స్థానిక డీసీఎంఎస్ సమావేశ మందిరంలో సోమవారం 92వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ మాట్లాడుతూ వ్యాపారాన్ని విస్తరించి మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు ప్రణాళిక రూపొంచామన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ నుంచి రావాలసిన కమీషన్ల బకాయిలను చెల్లించాలంటూ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డీసీఎంఎస్ వినిమయ కేంద్రాలను పునరుద్ధరించి తద్వారా రైతులకు అవసరమైన సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నికర ఆస్తుల ద్వారా మరింత ఆర్థిక అభివృద్ధిని పెంపొందించేందుకు ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడతూ చాలా చోట్ల సొసైటీలు వ్యాపారాలను కొనసాగిస్తూ ఆర్థిక అభివృద్ధిని సాధించాయన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య వచ్చినా సమష్టిగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వల్లూరు సింగల్ విండో ప్రెసిడెంట్ లేబాక నాగేశ్వర్‌రెడ్డి, డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ గోపీనాయక్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాకు గుర్తింపు లేదా?

● స్మార్ట్ రేషన్‌కార్డులలో కానరాని కొత్త జిల్లా పేరు ● లబ్ధిదారుల్లో ఆందోళన

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాలు ఏర్పడి సుమారు మూడున్నర సంవత్సరాలు అవుతోంది. 2022 ఏప్రిల్‌లో కొత్తగా జిల్లాలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి కొత్త జిల్లా కేంద్రాలలోనే కలెక్టరేట్లు, జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఏర్పడి పరిపాలన జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొత్త జిల్లాల ప్రామాణికంగానే అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకులను ప్రజలకు అక్రమాలు, మోసాలకు తావు లేకుండా పంపిణీ చేయాలన్న ఉద్దేశ్యంతో పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులలో మాత్రం కొత్త జిల్లాలకు చోటు కల్పించలేదు. ఉమ్మడి కడప, ఉమ్మడి చిత్తూరు జిల్లా పేర్లతోనే కార్డులు ముద్రితమయ్యాయి. దీంతో కార్డు లబ్ధిదారులలో ఆందోళన కనిపిస్తోంది.



సంబేపల్లె మండలంలో లబ్ధిదారులకు ఇచ్చిన స్మార్ట్ కార్డులో కడప జిల్లాగా ఉన్న వైనం

అక్రమాలను అరికట్టేందుకు...

ప్రభుత్వం చౌకదుకాణాలలో సబ్సిడీతో బియ్యం, చక్కెర, కందిబేడలు, కిరోసిన్, గోధుమపిండి వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేది. తర్వాత కాలంలో కిలో రెండు రూపాయలకు బియ్యం, ఉచిత బియ్యం చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేసే వాళ్లు. అయితే ఆ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, కార్డు లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. లబ్ధిదారుల నోళ్లు కొట్టి నిత్యావసర సరుకులను రేషన్ డీలర్లు పక్కదారి పట్టించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రేషన్ సరఫరాలో పారదర్శకత, సులభతరం కోసం పాత రేషన్‌కార్డులకు బదులుగా స్మార్ట్ రేషన్‌కార్డులను కొత్తగా తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఇళ్ల వద్దకే తెచ్చి ఇస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల కార్డులను రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విడతల్లో పంపిణీ చేస్తోంది. మొదటి విడతలో తిరుపతి, చిత్తూరు జిల్లాలు, మూడవ విడతలో కడప, అన్నమయ్య జిల్లాల్లో పంపిణీ చేశారు. ఈ కార్డులు ఏటీఎం తరహాలో జేబులో పట్టేంత సైజులో ఉన్నాయి. ఈ కార్డు మీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కార్డుదారుల వివరాలన్నీ తెలుసుకోవచ్చు. లబ్ధిదారులు ఎక్కడ రేషన్ తీసుకున్నారు.. ఏయే వస్తువులు ఎంత తీసుకున్నారన్న సమాచారం కూడా తెలుస్తుంది. రేషన్‌కార్డు నెంబర్ పాతదే అయినా భవిష్యత్తులో ఏటీఎం తరహాలో స్వైపింగ్ చేసే వెసులుబాటు ఉంది. ఈ కార్డులు వినియోగించడం వల్ల మిషన్లు మెరాయించే పరిస్థితి ఉండదు. ఈ కార్డులతో ఎక్కడైనా సరుకులు తీసుకునే సౌకర్యం ఉండడంతో షాపుల దగ్గర రద్దీ తక్కువగా ఉంటుంది. మోసాలకు అడ్డుకట్ట పడుతుంది. అత్యవసర సమయాల్లో ఈ కార్డు అధికారిక గుర్తింపు కార్డుగా కూడా ఉపయోగపడుతుంది.



మదనపల్లెలో లబ్ధిదారులకు ఇచ్చిన కార్డుల్లో ముద్రితమైన చిత్తూరు జిల్లా పేరు

కార్డులపై కానరాని కొత్త జిల్లా పేర్లు

రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన స్మార్ట్‌కార్డుల మీద అడ్రసులో కొత్త జిల్లాల పేరు లేదు. జిల్లాల విభజన తర్వాత ఏర్పడిన ప్రకారం కాకుండా ఉమ్మడి జిల్లాల పేరే ఉంది. అన్నమయ్య జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఉమ్మడి కడప జిల్లా నుంచి రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలను, ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలను కలిపి కొత్తగా అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. కొత్త జిల్లాలు ఏర్పడిన 2022 ఏప్రిల్ నుంచి ఈ మేరకే పరిపాలన జరుగుతోంది. అయితే కొత్తగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు చెందిన స్మార్ట్‌కార్డులలో కడప జిల్లాగానే ముద్రించారు. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో చిత్తూరు జిల్లాగా ముద్రించారు. స్మార్ట్‌కార్డు అత్యవసర పరిస్థితుల్లో అధికారిక గుర్తింపు కార్డుగా కూడా ఉపయోగపడే నేపథ్యంలో అన్నమయ్య జిల్లా పేరు లేకపోవడంపై కార్డు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ కార్డులలో జిల్లా పేరు మార్పు ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందా.? పొరపాటున జరిగిందా.? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ స్మార్ట్‌కార్డులు చాలా కాలం పాటు వినియోగంలో ఉండే నేపథ్యంలో జిల్లా పేరు అన్నమయ్యగా ముద్రించి ఉంటే బాగుండేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కార్డు లబ్ధిదారుల ఆందోళనకు పరిష్కారం చూపించాల్సి ఉంది.

సరస్వతీ.. నమస్తుభ్యం...

● వైభవంగా దసరా ఉత్సవాలు
● సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం



రాయచోటి వీరభద్రాలయంలో సరస్వతి దేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పలు ఆలయాల్లో 8వ రోజు సోమవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీలేరులోని రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో, గుర్రంకొండలోని రెడ్డెమ్మ తల్లి మహా సరస్వతీదేవి అలంకారంలో, రాజంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బిందె సేవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిశాల నుంచి రాజంపేట పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీగా వెళ్లారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన బిందెసేవ కార్యక్రమానికి పెద్దఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారులు వేసిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి. మదనపల్లెలోని కన్యకాపరమేశ్వరిదేవి, కోర్టులో గంగమ్మ ఆలయాల్లో సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నీరుగట్టువారిపల్లెలోని తారక లేవుట్‌లో టీడీపీ యువ నాయకుడు ప్రభు గౌడ్, పరిమళరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అమ్మవారిని ఏర్పాటు చేసి ప్రతిరోజూ విశేషంగా పూజలు చేస్తున్నారు. అక్టోబరు 4వతేదీ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




కోర్టులో గంగమ్మ ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో గంగమ్మ



రాజంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీదేవి అలంకారం



మదనపల్లెలో కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో సరస్వతి దేవి అలంకారం



మహా సరస్వతీదేవి అలంకరణలో గుర్రంకొండ రెడ్డెమ్మ అమ్మవారు



మదనపల్లె నీరుగట్టువారిపల్లెలోని తారకలేవుట్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ తల్లి



రాజంపేటలో అలరించిన చిన్నారుల కోలాటం



సరస్వతీదేవి అలంకరణలో పీలేరు రౌద్రాలమ్మ

నాలుగున్నరేళ్లలో
గుంతలమయం చేశారు
● కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ధ్వజం
6
పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

జీఎస్టీ ఫలాలు సామాన్యులకు అందేలా కృషి

● జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సునీత



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సునీత

పీలేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ సంస్కరణలను వారికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులదేనని జీఎస్టీ తిరుపతి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సునీత తెలిపారు. జీఎస్టీ సంస్కరణలపై మదనపల్లె సర్కిల్ వాణిజ్య పన్నుల శాఖ సోమవారం పీలేరు పట్టణ పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బందికి స్థానిక పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం చేపట్టింది. 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలలో కొనుగోలు శక్తి పెంచాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు తెచ్చిందన్నారు. దాదాపు 99 శాతం నిత్యావసర సరుకులపై జీఎస్టీని భారీగా తగ్గించిందన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దాదాపు 8 వేల కోట్ల మేర నష్టం వాటిల్లుతున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెనుకాడడం లేదన్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా ఆ డబ్బు ప్రజలకు మిగిలిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయాలను సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ తన పరిధిలోని ఇళ్లకు తిరిగి ప్రచారం చేయాలని, అలా చేసిన ఫొటోలను యాప్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఏసీటీవో చిరంజీవి, జీఎస్టీవో శివయ్య పలు వస్తువుల ధరల్లో ఏర్పడిన వ్యత్యాసాలు, వివి ధ రంగాల్లో ప్రజలకు చేకూరే లాభాన్ని వివరించారు. కార్యక్రమంలో పీలేరు ఎంపీడీవో రాజేశ్వరి, సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, వార్డు సభ్యులు ఆబిద్, నాగరాజ నాయక్, మల్లికార్జున రెడ్డి, శ్రీశైలం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడు మృతి



మృతిచెందిన కృష్ణ భగవాన్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడిన ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం మదనపల్లె మండలం, బసినికొండ సమీపంలోని సయ్యద్‌కార్స్ వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాల్మీకి వీధికి చెందిన నరసయ్య కుమారుడు కృష్ణ భగవాన్ (28)ఆటో నడుపుతూ అదుపు తప్పి ఆటోకింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలుకా పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తూ యువకుడు..



మృతిచెందిన యువకుడు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 29: లక్కిరెడ్డిపల్లె ప్రాంతంలో విద్యుత్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజయ్ (32) ప్రమాదవశాత్తు లైన్లు తగిలి సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పశ్చిమబెంగాల్ రాష్ట్రం పూర్వవర్ధమాన్ జిల్లా రామగోపాల్పూర్‌కు చెందినవాడని, గత కొంతకాలంగా ఓ కాంట్రాక్టర్ కింద లైన్‌మెన్‌గా, సహాయకుడిగా పనిచేస్తున్నాడని, కుర్నూతల మూలపల్లి ప్రాంతంలో విద్యుత్ లైన్లు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగులుకొని మృత్యువాత పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ...



రెడ్డిశేఖర్ మృతదేహం

కలకడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడు రెడ్డిశేఖర్ (19) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు... కోన గ్రామవాసి శివశంకర్ కుమారుడు రెడ్డిశేఖర్ రాయచోటిలోని ఓ కళాశాలలో ఐటీఐ చదువుకుంటున్నాడు. పరీక్షల ఫీజు కోసం తండ్రిని డబ్బులు అడుగగా సర్దుబాటు చేసి పంపుతానని సమాధానం ఇచ్చాడన్నారు. దీంతో మనస్థాపం చెంది 27న ఇంటికి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో వుండగా కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 నుంచి సౌత్ ఇండియా లెవల్ క్యారమ్స్ పోటీలు

నందలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్‌ఇండియా లెవల్ క్యారమ్స్ పోటీలు అక్టోబరు నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సోమవారం మాట్లాడుతూ పోటీలో పాల్గొనదలచిన వారు అక్టోబరు 5వ తేదీ లోపు ఎంట్రీలు పంపాలని తెలిపారు. కార్యమ్స్ పోటీలు(స్త్రైట్ గేమ్స్) ఉంటాయని తెలియజేశారు. ఎంట్రీలను బీఎస్ శంకర్, ప్రెసిడెంట్ యమ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ నందలూరు, అన్నమయ్య జిల్లా వారికి పంపాలని తెలిపారు. ఈ పోటీల్లో డబుల్స్ విన్నర్స్‌కు రూ.40 వేలు, డబుల్ రన్నర్స్‌కు 25 వేలు, సింగిల్స్ విన్నర్స్‌కు రూ.25 వేలు, సింగిల్ రన్నర్స్‌కు రూ.15 వేలు, డబుల్స్ సెమిఫైనల్ లూజర్సుకు రూ.12 వేలు, సింగిల్ సెమీఫైనల్ లూజర్స్‌కు రూ.8 వేలు, డబుల్ క్వార్టర్ ఫైనల్ లూజర్స్‌కు రూ.12 వేలు, సింగిల్ క్వార్టర్ ఫైనల్ లూజర్స్‌కు రూ.6 వేలు, బెస్ట్ ప్లేయర్ అవార్డుకు రూ.5 వేలు, క్యారమ్స్ పోటీల్లో ఓపెన్ ఫినిషింగ్ చేస్తే రూ.1000 ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు క్రీడాకారులకు భోజన సౌకర్యం కమిటీవారు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. వివరాలకు 7732054403ను సంప్రదించాలని టోర్నమెంట్ నిర్వాహకులు కోరారు.

ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు రాజశేఖర్

చిట్వేలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకుడిగా, ఎన్‌సీసీ అధికారిగా ఉత్తమ సేవలు అందించినందుకు ఉపాధ్యాయుడు పసుపుల రాజశేఖర్‌ను ఆచార్య దేవోభవ జాతీయ పురస్కారం 2025 వరించింది. ఈ మేరకు ఆదివారం బాపట్ల జిల్లా వేటపాలెంలో యువతేజం ట్రస్టు, కలాం విజన్ సంస్థల ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు చీఫ్ సూపరింటెండెంట్ పీవీసీ అంజలికుమారి, సంస్థ ఛైర్మన్ ఎస్.కరీముల్లా, డాక్టర్ నారాయణస్వామి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ బోధన సామాజిక సేవా రంగాలకు చేస్తున్న కృషికి గాను అవార్డు దక్కిందని, ఇది బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు రాజశేఖర్‌ను అభినందించారు.

హరూన్ బజాజ్ మేళాకు విశేష స్పందన

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే హరూన్ బజాజ్ మెగా మేళా అండ్ ఎక్స్ఛేంజ్ ఈ ఏడాది కూడా విపరీతంగా ఆకట్టుకుందని హరూన్ బజాజ్ ఎండీ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ వాహన ప్రదర్శన, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, ఆకర్షణీయమైన డిస్కౌంట్లు, ప్రత్యేక ఫైనాన్స్ సౌకర్యాలు వంటి ఎన్నో అవకాశాలతో ఈ కార్యక్రమం వినియోగదారుల నుంచి విశేష స్పందన పొందిందన్నారు. పాత వాహనాలను మోడరన్ బజాజ్ మోడల్స్‌కి మార్చుకోవాలనుకునే వారికి ఈ మేళా ఒక గొప్ప అవకాశమని, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అందుబాటులోకి తెచ్చిన మోడల్స్, తక్కువ డౌన్‌పేమెంట్‌కి తీసుకునే అవకాశాలు పెద్దఎత్తున ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ మెగా మేళా వినియోగదారుల విశ్వాసానికి అద్దం పడుతూ సక్సెస్ అవుతుందన్నారు. ఈ సారి కూడా అదేస్థాయిలో మద్దతు లభించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.



కస్టమర్‌కు వాహనాన్ని అందిస్తున్న హరూన్ బజాజ్ సంస్థ ప్రతినిధులు

సీతాఫలం సాగు... భలే బాగు...!

- సహజసిద్ధంగా కాసిన కాయలు
- తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి
- పలు పట్టణాలకు తరలింపు
- కూలీలకు దొరుకుతున్న ఉపాధి



బురకాయలకోటలో ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న సీతాఫలం కాయలు



ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎలాంటి రసాయనాలు... పురుగుల మందులు వాడకుండా పండే ఫలం సీతాఫలం. ఎంతో మధురమైన ఈ కాపు ఈ ప్రాంతంలోని అడవులు, కొండలు, గుట్టల్లో స్వచ్ఛమైన వాతావరణంలో సహజ సిద్ధంగా పెరుగుతాయి. రెండు నెలలుగా వర్షాలు బాగా కురవడంతో సీతాఫలం కాయల దిగుబడి బాగా ఉంది. జిల్లాలోనే ములకలచెరువు మండలం బురకాయలకోట సీతాఫలానికి ప్రసిద్ధి గాంచింది. ఇక్కడి నుంచి ప్రతి రోజు మన రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడ సహజసిద్ధంగా కాసే సీతాఫలం కాయలు ఎంతో మధురంగా, రుచిగా ఉండడంతో బాగా డిమాండ్ ఉంటుంది.

నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట, దేవళచెరువు, సోంపాళ్యం, కాలువపల్లె, నల్గొండ, బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్, గట్టు, తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె, ముద్దలదొడ్డి, పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు, బి.కొత్తకోట మండలం బయప్ప గారిపల్లె, ఉలవలవారిపల్లె, కురబలకోట మండలాలతో పాటు తదితర గ్రామాల సమీపాల్లో అడవులు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ సీతాఫలం చెట్లు వేలల్లో ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో సీలాఫలం కాయలు కాస్తాయి. ఈ ప్రాంతాల నుంచి కూలీలు కాయలను కోసుకొచ్చి బుర కాయలకోటలో విక్రయానికి తీసుకొస్తారు. అలాగే సత్యసాయి జిల్లా తనకల్లు, నల్లచెరువు, సరి హద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె, చేలూరు తదితర ప్రాంతాల నుంచి కూడా కాయలను కోసుకొచ్చి విక్రయించేందుకు కూలీలు ఇక్కడికి తెస్తున్నారు. ఆగస్టు నుంచి నవంబరు ఆఖరు వరకు సీజన్ నడుస్తుంది. ఇక్కడ కూలీల దగ్గర సీలాఫలం కాయలకు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన కాయలను గ్రేడింగ్ చేసి తెలంగాణ రాష్ట్రం మిరియాలగూడ, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, మిర్యాలగూడ, హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, సింధనూరు, చాయచూర్, గుల్‌బర్గా, హాస్పేట్, హుబ్లీ, బళ్లారి, దివనగిరి, తమిళనాడు రాష్ట్రం చెన్నై, మధురై, కృష్ణగిరిలతో పాటు మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, అనంతపురం, రాజమండ్రి, నంద్యాల తదితర పట్టణాలకు, నగరాలకు ఎగుమతి చేసి విక్రయిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు అధికంగా కురవడంతో కొండలు, గుట్టల్లో పచ్చదనం పరుచుకుంది. సీతాఫలం కాయలు కూడా బాగా కాశాయి.

కూలీలకు జీవనోపాధి

ప్రతి ఏడాది సీతాఫలం కాయలతో ఈ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు నుంచి నవంబరు నెల వరకు సీతాఫలం కాయలు కోసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తారు. సీలాఫలం కాయలు కూలీలకు ఎంతో ఆసరాగా ఉంటుంది. ఇక్కడి కూలీలు ప్రతి రోజు ఉదయమే అడవులు, కొండలు, గుట్టలకు వెళ్లి కాయలు సేకరించి సాయంత్రం బురకాయలకోటకు తీసుకొచ్చి వ్యాపారస్థులకు విక్రయిస్తుంటారు. వ్యాపారులు కూలీల వద్ద నాణ్యతను బట్టి ఒక్కో క్రేటును రూ.350 నుంచి రూ.450 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కూలీ ప్రతి రోజు రెండు నుంచి ఐదు క్రేట్ల కాయలు సేకరిస్తారు. ప్రతి ఏడాది సీతాఫలం కాయల సీజన్‌లో బురకాయలకోట కేంద్రంగా భారీగా వ్యాపారం జరుగుతోంది. కూలీల వద్ద కొన్న కాయలను వ్యాపారులు గ్రేడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బయటి ప్రాంతాల్లో క్రేటు సీతాఫలం ధర రూ.700 వరకు పలుకుతోంది. ప్రతి రోజు బురకాయలకోట నుంచి 800-1000 క్రేట్ల వరకు కాయలు ఎగుమతి అవుతున్నాయి.

జీవనోపాధి దొరుకుతోంది

- గోపాలమ్మ, కూలీ, బురకాయలకోట



సీతాఫలం కాయల ద్వారా జీవనోపాధి లభిస్తోంది. మా ఊరికి సమీపంలో ఉన్న కొండలు, గుట్టల్లోకి ప్రతి రోజూ వెళ్లి రెండు నుంచి ఐదు క్రేట్ల కాయలను కోసుకొచ్చి ఆటోలో తీసుకొచ్చి అమ్ముకుంటున్నాం. ప్రతి రోజు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం వస్తోంది. వర్షాలు బాగా కురవడంతో కాయలు బాగా ఉన్నాయి.

గొర్రెలు మేపుకొనేందుకు వెళ్లి కోసుకొస్తాను

- గోపి, రంగనాయనిపల్లె



కొండలు, గుట్టల్లోకి గొర్రెలు మేపుకొనేందుకు వెళ్తాను. అక్కడ సీతాఫలం చెట్లు భారీగా ఉండడంతో గొర్రెలు మేపుతూ సీతాఫలం కాయలు కూడా కొసుకొచ్చి విక్రయిస్తున్నాను. ప్రతి రోజూ రెండు క్రేట్ల కాయలు కోసుకొచ్చి బురకాయలకోటలో అమ్ముతాను. రోజు రూ.700 వరకు ఆదాయం వస్తోంది.

నాలుగున్నరేళ్లలో గుంతలమయం చేశారు

- కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ధ్వజం
- ప్రొటోకాల్ విషయమై వైసీపీ కౌన్సిలర్ల రగడ
- అజెండాలో పలు అంశాలను ఆమోదించని వైసీపీ కౌన్సిలర్లు



కౌన్సిల్‌లో ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ తులసి

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాలుగున్నరేళ్ల మున్సిపల్ కౌన్సిలర్ల పాలనలో మదనపల్లె పట్టణంలో అభివృద్ధి పనులను అటకెక్కించారని, పలు రోడ్లను గుంతలమయం చేశారని టీడీపీ కౌన్సిలర్ తులసి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాల్లో ఛైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత కౌన్సిలర్ తులసి మాట్లాడుతూ పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపితే, ఛైర్‌పర్సన్‌తో పాటు, వైసీపీ కౌన్సిలర్లు ఈ పనులను అజెండాలో పెట్టకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. అధికారం వుంది కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తప్పుపట్టారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, అభివృద్ధి పనులు చేయించడంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కాని ఆయా వార్డుల్లో కౌన్సిలర్లకు ప్రొటోకాల్ విషయంలో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీరిపై కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో 11,800 విద్యుత్ వీధిదీపాలు వుంటే కేవలం నలుగురు లైటింగ్‌మెన్‌లు మాత్రమే పనిచేస్తున్నారని, వీరి సంఖ్య 30కు పెంచాలని ఛైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ కరీముల్లా మాట్లాడుతూ 35 వార్డుల నుంచి ప్రతి ఏటా రూ.21కోట్లు పన్నుల రూపంలో నిధులు వస్తుంటే కేవలం కొన్ని వార్డులకే ఈ నిధులు కేటాయించడంపై ఆక్షేపించారు. కౌన్సిలర్ ప్రసాదబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాలకు రాజ్యాంగం ప్రకారం నిధులు కేటాయించాల్సి వుండగా అది జరగడం లేదని విమర్శించారు. కోమటివానిచెరువు వద్ద మున్సిపల్ స్థలం కబ్జాకు గురవుతోందని, దాన్ని కాపాడాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లు బీఏ ఖాజా, అర్జున తదితరులు పలు అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటిపై ఛైర్‌పర్సన్ స్పందిస్తూ సమావేశంలో లేవనెత్తిన అంశాలపై చర్చించి వచ్చే సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కాగా ఛైర్‌పర్సన్ మనూజ తీర్మానించి రూపొందించిన అజెండాలోని కొన్ని అంశాలను మెజారిటీ వైసీపీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తూ ఆమోదించలేదు. సమావేశంలో వైస్‌ఛైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు ఫర్జానా, సరిత, గిరిజ, రాజేష్, మున్సిపల్ మేనేజర్ మనోహర్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్



గాలివీడులో గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గాలివీడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టుగా సాగుతున్న గంజాయి బ్యాచ్‌పై పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం గాలివీడు పట్టణంలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయమై సీఐ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా రెక్కీ నిర్వహించిన అనంతరం పక్కా సమాచారంతో చిలకలూరిపేట వద్ద గుడిసెల్లో నివాసం ఉంటూ గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించామని, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని ఫోన్ ద్వారా గంజాయి క్రయ విక్రయాలు సాగిస్తున్న మరో ఇద్దరు యువకులను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ముగ్గురిని అదుపులోకి తీసుకుని లక్కిరెడ్డిపల్లెకు తరలించి విచారిస్తున్నామన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి మూలాలను సమూలంగా కూకటివేళ్లతో పెకిలించి వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళపై దాడి కేసులో పట్టుబడ్డ నిందితుడు

- 95 గ్రాముల బంగారం, పల్సర్‌బైకు స్వాధీనం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ

రాజంపేటటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వత్తలూరు వడ్డిపల్లెకు చెందిన మహిళపై దాడిచేసి పరారైన నిందితున్ని పుల్లంపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఈ నెల 10న వత్తలూరు వడ్డిపల్లె గ్రామానికి చెందిన ఏరుకాల్వ రమాదేవిపై దాడిచేసి పరారైన పీలేరు మండలం బోడుమల్లివారిపల్లెకు చెందిన వేముల విశ్వనాథం అలియాస్ ఊసోడును పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద సోమవారం అరెస్ట్ చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.9.50 లక్షలు విలువ చేసే 93.030 గ్రాముల బంగారం, పల్సర్ బైకు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చిత్తూరు జిల్లా సదుం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు, పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిని పట్టుకుని బంగారం రికవరీ చేసినందుకు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, పుల్లంపేట ఎస్‌ఐ శివకుమార్, పెనగలూరు ఎస్‌ఐలను అడిషనల్ ఎస్పీ రామ్‌నాధ్‌హెగ్డే అభినందించారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపిక



సౌత్‌జోన్ కబడ్డీకి ఎంపికైన విద్యార్థిని పెంచలయ్య

రైల్వేకోడూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిడిగ్రీ కళాశాలలో బీకాం 3వ సంవత్సరం చదువుతున్న బోయ శివకుమార్ సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ ఎంపికలో తమ కళాశాల విద్యార్థి విశేషంగా ప్రతిభను కనబరిచాడని తెలిపారు. సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు త్వరలో కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరగనున్నాయని తెలిపారు. సౌత్‌జోన్ పోటీల్లో కూడా తమ విద్యార్థి రాణించాలని ఆయన అభినందించారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'



మాట్లాడుతున్న అశోక్‌బాబు

నందలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు అన్నారు. సోమవారం నందలూరుకు చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు దళిత నాయకులు స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో అశోక్‌బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలు అన్ని విధాలుగా నష్టపోతారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు అనూహ్య స్పందన వస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, అర్మగం విశ్వనాథ్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, నాయనపల్లి ఆదినారాయణ, తుమ్మది శివకుమార్, గుడిసె సుబ్రమణ్యం, ఎముక దుర్గయ్య, శివ నరసింహులు, సురేష్, నాగభూషణం, నాగరాజు, డిస్కో మణి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కలకడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంగా ఘర్షణ పడ్డ ఇరు వర్గాల్లోని నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బాలయ్యగారిపల్లి పంచాయతీ ఝరిగడ్డ వాసులైన తిరుమలేశు, వెంకటరాయుడుకు భూ తగదాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో భూమి వద్ద ఇరువర్గాలు గొడవ పడి కర్రలతో దాడి చేసుకున్నట్లు తెలిపారు. ఘటనలో ఓ వర్గంలోని తిరుమలేశు, చంద్రకళ మరో వర్గంలోని వెంకటరాయుడు, సరస్వతిలకు గాయాలైనట్లు చెప్పారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

టైర్ పేలి అరటికాయల వాహనం బోల్తా



బోల్తా పడ్డ అరటికాయల వాహనం

ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): టైర్ పగిలి అరటి కాయల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు అరటి కాయలు తీసుకెళ్తున్న బొలేరో వాహనం సోమవారం ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని సెంట్రల్ స్కూల్ వద్దకు రాగానే టైరు పగిలింది. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



చల్లబసాయిపల్లెలో తొలగించిన ఉల్లి పంటను పొలంలోనే వదిలేసిన దృశ్యం

పొలాల్లోనే వదిలేశారు...!

- కోత దశకు చేరిన ఉల్లి
- రేటు లేక రైతు కంట తడి

దువ్వూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. అష్టకష్టాలకు ఓర్చి పంట సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక రైతులు కంటతడి పెడుతున్నారు. ఇప్పుడిప్పుడే పంట కోత దశకు చేరుకుంటోంది. ధర లేకపోవడంతో పండిన పంటను కొనుగోలు చేసే వారు లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

దువ్వూరు మండలంలో పెద్దబళ్లారితోపాటు కేపీ ఉల్లి పంటను రైతులు విరివిగా సాగు చేస్తారు. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో గుడిపాడు, దువ్వూరు, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, దాసరిపల్లి, నీలాపురం, మదిరేపల్లె, చిన్నసింగనపల్లె, రామాపురం, మనేరాంపల్లె ప్రాంతాల్లో పెద్దబళ్లారి రకం ఉల్లి సాగు చేశారు. మండలంలో 1200 ఎకరాల మేరకు ఉల్లి సాగైందని వ్యవసాయశాఖ తెలుపుతోంది. ముఖ్యంగా సాగుకు ఎకరాకు రూ.60 వేలు దాకా పెట్టుబడుల కింద ఖర్చు చేశారు. మధ్యలో అకాల వర్షాలు పంటను దెబ్బతీస్తూ వచ్చాయి. అవాంతరాలను ఎదుర్కొని ఎట్టకేలకు దిగుబడులు చేతికందుతున్నాయి. ఈ సమయంలో ధర పతనమై కొనుగోదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఏడాది క్వింటా రూ.3 వేలు ధర ఉండగా, ఈ ఏడాది రూ.600 నుంచి 700 కూడా లేదు. ఇక ప్రభుత్వం రూ.1200లతో కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ అమలు కావడం లేదు. దీంతో పంటను ఒడిపేందుకు రైతులు తటపటాయిస్తున్నారు. కొందరు రైతులు మాత్రం అక్కడక్కడ పంటను తొలగించారు.

వర్షాలకు పొలంలోనే...

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా.. అసలే ఉల్లికి గిట్టుబాటు ధర లేదని ఆందోళనలో ఉన్న రైతులను వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. ఉల్లి పంటను తొలగించాక వర్షం పడటంతో గడ్డలను వేరు చేయకుండా పొలంలో అలాగే వదిలేశారు. ధర లేకపోవడంతో ఖర్చులు నెత్తికొస్తాయనే భయంతో వదిలేశారు. కాగా, మరో పది రోజుల్లో మరికొంత మంది రైతులు పంటను ఒడిపేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉల్లి కొనుగోలు కేంద్రం వైపు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే బాసటగా ఉంటుందని... ఈదిశగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకోవాలని సంబంధిత రైతులు కోరుతున్నారు.

వాతావరణం అనుకూలించలేదు



నేను రెండు ఎకరాల్లో పెద్దబళ్లారి ఉల్లి వేశాను. వాతావరణం అనుకూలించకపోవడంతో పంట తీసి పొలంలోనే వదిలేశాను. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి అయింది. రూ.80వేలు నష్టపోయాను. పంట తొలగించాలంటే నాతోటి రైతులు భయపడుతున్నారు.

- రుద్రారెడ్డి, రైతు, చల్లబసాయిపల్లె, దువ్వూరు మండలం

రైల్వే ట్రాక్షన్ అప్‌గ్రేడ్ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో గుంతకల్-కడప మధ్య భూసేకరణ

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే పరిధిలో రైల్వే ట్రాక్షన్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 2 (37ఎ) ప్రకారం 1.25 కేవీ నుంచి 2.25 కెవీ విద్యుత్ ట్రాక్షన్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ పనులను ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటిస్తూ కేంద్రం అధికారిక నోటిఫికేషన్ ఈనెల 24వ తేదీ జారీ చేసినట్లు ప్రాజెక్టు అధికారి అమిత్ అగర్వాల్ తెలిపారు. ఈప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా 3000 మెట్రిక్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని సాధించాలన్న దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ముద్దనూరు, కడప మధ్య భూసేకరణ చేపట్టనున్నారు. ఈ భూసేకరణ ప్రజాప్రయోజనం కోసం జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జరుగుతుందని తెలిపారు.

సమ్మెలో పాల్గొన్న డాక్టర్లు



చాపాడు ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

చాపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ కోర్కెలు నెరవేరేవరకు పలు రకాల పద్ధతుల్లో నిరసనలు తెలుపుతామని డాక్టర్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, శ్రీవాణి, కావ్య మాధురి సమ్మెలో పాల్గొన్నారు. డాక్టర్లు ఆస్పత్రులకు వచ్చి రోగులకు పరీక్షలు చేయకుండా విధులకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వం పీజీ కాలేజీల్లో అడ్మిషన్ల విషయమై 50 శాతం కోటాను రద్దు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. కాగా, ఆస్పత్రిలో ఉన్న స్టాఫ్‌నర్సులు భాగ్యవతి, సునీతలు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యేలు



ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు ఆది, పుట్టా

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నచికేత్ విశ్వనాథ్‌ను సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎస్పీతో స్థానిక సమస్యలపై మాట్లాడినట్లుగా తెలిసింది.

అర్ధరాత్రి తాగి వీరంగం... నలుగురు యువకులపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో శనివారం అర్ధరాత్రి తాగి వీరంగం చేసిన నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు యువకులు తాగి అల్లరి చేస్తుండగా కానిస్టేబుల్ మందలించడంతో గొడవకు దిగారు. దీంతో కానిస్టేబుల్ బ్లూకోల్ట్స్ పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో వారు నలుగురు యువకులను టూటౌన్ పోలీసు స్టేషనుకు తీసు కెళ్లారు. సీఐ సదాశివయ్య వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సెల్‌ఫోన్లు తీసు కొని అడ్రస్సులు, సంతకాలు తీసుకొని ఇంటికి పంపారు. ఈ విషయం ఎస్పీ విశ్వనాథ్ దృష్టికి వెళ్లింది. ఆయనే స్వయంగా సీఐకి ఫోన్ చేసి జరిగిన సంఘటనపై వివరణ కోరారు. అనంతరం ఇలాంటి ఘట నలను ఉపేక్షించవద్దని తెలిపారు. దీంతో నలుగురిని విచారించగా వీరి లో పిట్లా వెంకటచరణ్, కాటం సాయి తేజపై పలు స్టేషన్లలో క్రికెట్ బెట్టింగ్, జూదం కేసులు వున్నాయి, కాటం వీరేంద్రనాథ్, మరో యువ కుడు మహేష్‌పై ఒక కేసు వుంది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదాశివయ్య తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన ఇద్దరిపై..

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పనిచేస్తున్న మండల ఈవోపీఆర్‌డీ రామాంజనేయరెడ్డి రెండు రోజుల క్రితం రాత్రివేళ బార్‌లో ఉండగా ఎస్సీ జన సంఘం అధ్యక్షుడు పెద్దిరాజు, దాసరి శివక్రిష్ణ అనే వ్యక్తులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. పెద్దిరాజు కొత్తపల్లెలో కాలువ ఆక్రమణపై ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుపై చర్యలు తీసుకోకుండా క్లోజ్ చేస్తావా అంటూ కార్యదర్శి రామాంజనేయరెడ్డిని దుర్భాషలాడుతూ దాడి చేశా రు. పంచాయతీ కార్యాలయానికి వచ్చి మాట్లాడమని, ప్రైవేటు ప్రదే శంలో ఉన్నపుడు అడిగితే ఏం సమాధానం చెబుతామని చెప్పినా విన కుండా దాడి చేశారని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో రామాజంనేయ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెద్దిరాజు, దాసరి శివక్రిష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదాశివయ్య తెలిపారు.


పాము కాటుకు వివాహిత మృతి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యు.వెంకటాపురం గ్రామానికి చెందిన సుంకన్నగారి సువర్ణ (28) అనే మహిళ పాముకాటుకు మృతి చెందింది. శనివారం తన పొలం వద్ద ఉన్న గడ్డిని గొర్రె పిల్లల కోసం కోస్తుండగా గడ్డిలో ఉన్న పాము కాటు వేసింది. వెంటనే చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు.

ఆలయ హుండీలో చోరీ

మైలవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మర నంద్యాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుడి తాళం తీసి ఆలయ హుండీలో ఉన్న నగదు చోరీ చేశారు. సోమవారం ఉదయం ఆలయ ధర్మకర్త నరసింహులు గుడిలోకి వెళ్లి చూడగా హుండీకి ఉన్న తాళం తీసి అందులో ఉన్న దాదాపు రూ.6వేలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



మొబైల్ ఫోన్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న పోలీసులు

కడప క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై తనకు దొరికిన ఐఫోన్‌ను వెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి అప్పగించి ఓ వ్యక్తి తన నిజాయితీని నిరూపించుకున్నాడు. వివరాలిలా.. చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన బయనబోయిన కిరణ్‌కుమారి ఆదివారం బట్టలు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి షాపింగ్ మాల్ వెళుతుండగా తన రూ.80వేలు విలువ చేసే ఐఫోన్ పోగొట్టు కుంది. ఆమె వెంటనే చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే క్రమంలో ఆర్టీసీ కాలనీకి చెందిన ముత్యాలపాడు శ్రీనివాసులుకు బ్రహ్మయ్య షెడ్డు వద్ద మొబైల్ ఫోను దొరకగా అయన స్టేషన్‌కు వచ్చి సీఐ ఓబులేసు, ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. దీంతో శ్రీరా ములును పోలీసులు అభినందించారు. సోమవారం బాధితురాలిని పిలిపించి ఫోన్‌ను అప్పగించారు. దీంతో బాధితురాలు శ్రీరాములుకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

స్వర్ణకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు షాపుల్లో పనిచేసే కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో అయిదు వేల మంది బంగారు పనిచేసే కార్మికులు ఉన్నారని, ఇటీవల కాలంలో బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోవడం, అ కార్పొరేట్ షాపింగ్ మాల్స్ రావడంతో కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. దీంతో కుటుంబ పోషణ కోసం కార్మికులు వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో శేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలిండియా చిల్డ్రన్ ఫెస్టివల్

- అలరించిన నృత్య ప్రదర్శనలు ● బహుమతులు ప్రదానం



ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, శశిభూషణ్‌రెడ్డి, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీలో ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆలిండియా స్కూల్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డిలు హాజరయ్యారు. నాలుగురోజుల పాటు యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ (యుఎస్‌ఓ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుంచి దాదాపు 150 మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై వారివారి సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెబుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. నృత్య ప్రదర్శన, పెయిటింగ్, వక్తృత్వ పోటీలు, జనరల్ క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డిలు మాట్లాడుతూ భిన్న సంస్కృతులను ఒక్కచోటకు చేర్చి తమ సంప్రదాయాలను తెలియజెప్పే కార్యక్రమాలను నిర్వహిస్తున్న యూఎస్‌ఓ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. పలు రాష్ట్రాలలోని సంస్కృతులు, సంప్రదాయలు కలిగిన విద్యార్థులు ఒకే వేదికపై వారిలోని సృజనాత్మకను వెలికితీసి, నాణ్యమైన విద్య అందడం కోసం యూఎస్‌ఓ కృషి మరువలేనిదన్నారు. అలాంటి యూఎస్‌ఓ సంస్థ పులివెందులలో కార్యక్రమం నిర్వహించడం తమకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పులివెందులలో మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యూఎస్‌ఓ సెక్రటరీ జనరల్ సీనాజైన్, వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ బూమ్రా, నేషనల్‌కౌన్సిల్ మెంబర్ భానుప్రకాష్, బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి వాజ్‌పేయి, పులివెందుల మండల అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని జిల్లా మలేరియా అధికారి మనోరమ ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న ఫీవర్ సర్వే, లార్వా సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలు తెలుసుకున్నారు. దోమల వల్ల ప్రబలే వ్యాధులను ప్రజలకు వివరించి వారికి అవగాహన పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె ప్రజలకు సూచనలిస్తూ ఇళ్లలో, పరిసరాల్లో శుభ్రత పాటించి, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొద్దీన్, సబ్‌యూ నిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలని సోమవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి నేషనల్ మజ్దూర్ యూనియన్ (యూనిటీ)కార్మిక నేతలు కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు బ్రహ్మం, రీజినల్ ఛైర్మన్ శేషన్న మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు రూట్‌లో తిప్పుతున్న నాన్‌స్టాప్ బస్సులను పల్లె వెలుగు బస్సులుగా మార్చి అటు ప్రయాణికులకు, ఇటు ఉద్యోగులకు సమస్యలు లేకుండా చూడాలని వారు కోరారు. ఇందుకు ఆయన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ రీజినల్ కార్యదర్శి సుధాకర్, గ్యారేజీ కార్యదర్శి ఎస్‌ఎంవల్లితదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ తెలిపారు. జమ్మలమడుగు సబ్‌జైలును సోమవారం సీనియర్ సివిల్‌జడ్జి తనిఖీ చేశారు. ముందుగా సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. అక్కడున్న వసతులను గురించి ఆరా తీశారు. సబ్‌జైలులో లీగల్ ఎయిడ్ క్లీనిక్‌లను తనిఖీ చేసి, అక్కడున్న రికార్డులను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి వారి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అలాగే కమలాపురం, ప్రొద్దుటూరు జైళ్లను తనిఖీ చేసి లీగల్‌ఎయిడ్ క్లీనిక్‌ల ప్రాధాన్యతను తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్‌జైళ్ల సూపరింటెండెంట్లు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించాలని కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నుంచి సిబ్బంది తమ విధులను జాగ్రత్తగా, బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. సోమవారం కడప నగరం యూటీఎఫ్ కార్యాలయంలో కేజీబీవీలో పనిచేస్తున్న సిబ్బందితో సమా వేశం నిర్వహించారు.


ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. తప్పనిసరిగా సిబ్బంది సమయం పాటించాలన్నారు. ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడు తూ పాఠశాలల శుభ్రత, స్వచ్ఛతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట మనుషులు, వాచ్ ఉమెన్, ఏఎన్‌ఎంలు, అటెండర్లు, స్వీప ర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె నోటీసు



ఆర్టీపీపీ సీఈకి సమ్మె పత్రాన్ని ఇస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడం లేదంటూ విద్యుత్ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారు. సెంట్రల్ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఆర్టీపీపీ రిజినల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీపీపీ సీఈని కలిసి వారు సమ్మె నోటీసును ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు అనేక రూపాల్లో ఆందోళన చేసినా.. ప్రభుత్వం నుంచి కనీస స్పందనలేదన్నారు. 1999 నుంచి 2004 మధ్యలో ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికు లకు థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా విద్యుత్ సంస్థలే జీతాలు చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పలు దపాలుగా ఆందోళన చేసినప్పటికీ ఇప్పటి వరకు స్పందిం చలేదని విమర్శించారు. అక్టోబరు 6న విశాఖలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా, 8న తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన, 13న చలో విజయవాడ పేరుతో భారీ ఆందోళన, 14న అన్ని సంస్థల్లో వర్క్ టు రూల్ కార్యక్ర మం నిర్వహిస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించ కపోతే అక్టోబర్ 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించారు.



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.


మేనేజర్ - ఏడివిటి


ఒంటిమిట్ట: సరస్వతిదేవి అలంకారంలో వాసవి



రైల్వే కోడూరులో వాసవీ కన్యకా పరమేశ్వరి..


రాజంపేటలో చౌడేశ్వరి అమ్మవారు..


రాయచోటి ఎస్ఎన్ కాలనీలో ఉమాదేవి..


గాలివీడులో దుర్గామాత ..


లక్కిరెడ్డిపల్లెలో సర్వమంగళాదేవి..


నీలకంఠ్రావుపేటలో దర్గా మాతాజీ..

సామాంపాతు.. సరస్వతీ.. భగవతీ..

ఒంటిమిట్ట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం మూలా నక్షత్రం, వృశ్చిక లగ్నంలో ఆర్యవైశ్యులు బిందెసేవ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు మంత్రపుష్పం, దశ హారతులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, తుమ్మలపెంట శ్రీనివాసులు, రెంటాల హరికృష్ణ, రెంటాల లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో పంచామృతాభిషేకం, మహన్యాసరుద్రాభిషేకం, దేవీ భాగవత పారాయణం, నవావరణ, సువాసిని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గునిశెట్టి రమేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీలోని దర్బారు సాయినగర్‌లో సమర్థ సద్గురు దర్గా మాతాజీ సోమవారం సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మహాగణపతిపూజ, గంగపూజ, కలశ స్థాపన, సద్గురు దర్గా స్వామిజీ, సద్గురు దర్గా మాతాజీకి అభిషేకాలు, అలంకారాలు, మహా మంగళహారతితో ముగించారు. ఈ ఉత్సవాలకు వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలోని రామలింగేశ్వరాలయంలో సర్వమంగళాదేవి సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు.

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లి కస్పాలోని లడ్డు స్వామి, కాళికామాత ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రాత్రి అమ్మవారి దగ్గర తాళాలు, చెక్కభజనలు చేస్తున్నారు.

గాలివీడు : గుండ్లచెరువు పంచాయతీ పుసుపులవాండ్లపల్లె సమీపంలోని దుర్గామాత ఆలయంలో అమ్మవారు సోమవారం సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు సతీశ్‌కుమార్, శ్రీనివాసులుశర్మ, ప్రమోద్‌కుమార్‌స్వామి పూజలు చేశారు

రాయచోటి-నేతాజీ సర్కిల్: ఎస్ఎన్‌కాలనీ చెక్‌పోస్టు సమీపంలోని ఉమామహేశ్వరాలయంలో అమ్మవారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుడు నటరాజస్వామి, ఆలయ నిర్వాహకులు శివగంగిరెడ్డి ఏర్పాట్లు చేశారు.


రాజంపేటలో బిందె సేవ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


రాజంపేటలో వైభవంగా బిందె సేవ


రాజంపేట టౌన్ : పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం బిందెసేవ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి, సాధు కామాక్షమ్మ, వెంకటరాజంపేట కనకదుర్గ మహేశ్వర ఆలయంలో ఆలయాల్లో అమ్మవారు సరస్వతి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయగిరి యల్లమ్మ ఆలయంలో మహాగౌరిగా అనుగ్రహించారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఉదయం బిందెసేవ నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహశ్రేష్ఠి, సెక్రటరి గెలివి నాగసురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచికంటి నారాయణ, వల్లంకొండు చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్ : పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, అగస్త్యేశ్వరాలయాల్లో అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.**చిట్వేలి :** పాత చిట్వేలిలోని వీరభద్రాలయంలో అమ్మవారికి సరస్వతిదేవి అలంకారంలో పూజలు నిర్వహించారు.


నందలూరు: సరస్వతిదేవి అలంకారంలో వాసవి


చిట్వేలి: సరస్వతిదేవి అలంకారంలో భద్రకాళి


రాయచోటి: చదువుల తల్లిగా దాక్షాయణి


రాయచోటి: సరస్వతిగా వాసవీ కన్యకా పరమేశ్వరి

ప్రభుత్వ వైద్యశాలలో ఓపీ సేవలు బంద్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హక్కుల కోసం పోరాటంలో భాగంగా ఓపీ సేవలు బంద్ చేసినట్లు ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ ట్రెజరర్ జొన్నగడ్డల రాజశేఖర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం సత్వరమే సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించి ప్రజలకు వైద్యసేవలు అందేలా చూడాలని కోరారు.

రెడ్డివారిపల్లి బ్రిడ్జి నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తాం

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి..

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి బ్రిడ్జి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లిస్తామని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం కోడూరు తహసీల్దార్ కొనేటీ అమర్నాథ్ మరియు ఆర్ అండ్ బీ డీఈ జయప్రసాద్‌తో కలిసి బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపాలు లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యానికి కారణాలను తెలుసుకున్నారు. భూమి కోల్పోయిన బాధితుల వివరాలను వెంటనే నమోదు చేసి జిల్లా అధికారులకు తక్షణమే పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్వో సూజని, పార్వతి టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్టాన్ మౌలా(అల్లాబకష్), గిరి నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ముక్కా రూపానందరెడ్డి తదితరులు

ప్రజా శ్రేయస్సు కోసమే జీఎస్టీ సవరణలు

రైల్వేకోడూరు: ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీలో సవరణలు చేసిందని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరులో అధికారులు, ప్రజలతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా అభ్యున్నతి కోసం కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీలో వెసులుబాటు కల్పించిందన్నారు. దీంతో చిన్న వ్యాపారులు, ప్రజలకు చాలా ఊరట లభించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నాయని తెలిపారు. జీఎస్టీ రిఫార్మ్‌తో ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీలను ప్రజలు అభినందిస్తున్నారని తెలిపారు. ఈ కార్య క్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవరచుకోవాలి'

వీర బల్లి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవరచుకోవాలని రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సూచించారు. సోమవారం మండల పరిధిలోని సానిపాయి పంచాయతీ అరుంధతివాడలో నిర్మించిన సీతారాముల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హారతులు పట్టి ఆయనకు ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీతారాములకు పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆయనను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు


ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను ఆలకిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

కన్యకాపరమేశ్వరికి ఎమ్మెల్యే పూజలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి నవరాత్రుల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి,యువనాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కొప్పరపు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రాజంపేట సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి


సబ్‌కలెక్టర్ భావనను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రాజంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్క రించాలని టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారా యణ, గ్రామీణ మాజీ అధ్య క్షుడు బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా, సీని యర్ నాయకులు మారాతు సుబ్బనరసయ్య సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన ను కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సబ్ కలెక్టర్ ను కలిసి రోడ్డు, ట్రాఫిక్ సమస్యలను వివరిం చారు. రైల్వే అండర్ బ్రిడ్జి లేక వేలాది మంది విద్యార్థులు అవస్థలు పడు తున్నారన్నారు. రాజంపేట ఆఫీసర్స్ క్లబ్‌లో ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేసి యువతను క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు దేశం యువ నాయకులు కేఎల్ నరసింహ, చల్లా సుధాకర్ లయన్స్‌క్లబ్ జోన్ ఛైర్మన్ పెనిగలపాటి చంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ అమర్‌నాథ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్య లు త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ కోనేటి అమర్ నాథ్ సూచించారు. సోమవారం రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్య ల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు నిర్లక్ష్యం చేయ కుండా ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సంబంధమైన సమస్యలు సానుకూలంగా స్పందిస్తున్నామని తెలిపారు. భూ సమస్యల వినతులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలాలను ఆక్రమణబారిన పడకుండా వీఆర్‌వోలకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మానస, మండల సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, ఆర్ఐ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ ప్రమాణస్వీకారం

రైల్వేకోడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా రైల్వేకోడూరు టీడీపీ నాయకుడు పుల్లెల రమేష్ సోమవారం విజయవాడలోని పార్చ్యూనర్ మురళీ పార్క్ హోటల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి అప్పజెప్పిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా న్యాయం చేస్తానని తెలిపారు. తనకుసహకరించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న పుల్లెల రమేష్

కురవల సంక్షేమానికి కృషి చేయాలి

సుండుపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవితను కలిసినట్లు కురవ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మంగిరి సురేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కురవ, కురబ, కురుమల సంక్షేమానికి కృషి చేయాలని రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చూడాలని కోరామన్నారు. జిల్లాలో కురవల రాజకీయ ఎదుగుదలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. టీడీపీలో యువతకు ప్రత్యేక స్థానం కల్పిసున్నట్లు, కురవల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలియ జేశారు.


మంత్రి సవితతో సురేశ్‌కుమార్

వ్యాపారులు జీఎస్టీ పట్టికను ఏర్పాటు చేయాలి

రాజంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించినట్లు చెబుతున్నా వ్యాపారులు మాత్రం పాత జీఎస్టీనే అమలు చేస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పూల భాస్కర్ తెలిపారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ పట్టణంలోని వాహనాల షోరూంలో పాత, కొత్త జీఎస్టీ పట్టిక ఏర్పా టు చేయకుండా ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలను మోసం చేస్తున్న వ్యాపారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకో వాలని కోరారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు విజయభాస్కర్, రాజంపేట మండల అధ్యక్షుడు మహదేవయ్య, నారా శివయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూల భాస్కర్

పోతుగుంట నియామకం జిల్లాకే గర్వకారణం


రమేశ్ నాయుడును సన్మానిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్ల మెంట్ కేంద్రం నుంచి ఇటీవల శ్రీశైలం దేవస్థాన ఆలయ చైర్మన్ గా పోతుగుంట రమేశ్ నాయు డు నియామకం జిల్లాకే గర్వ కారణమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు బి.భాస్కర్, తాలూకా అధ్యక్షుడు ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి అన్నారు. సోమవారం వారు రమేశ్ నాయుడును కలిసి శాలువాతో సన్మానించారు. సీనియర్ జర్నలిస్టు త్రివిక్రమ్, రాయలు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి తుపాకుల సురేష్, ఉదయగిరి కళ్యాణ్, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు సాంబశివనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీహరి, చౌడవరం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భుజంగేశ్వరుడికి పూజలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని భుజంగేశ్వరాలయంలో సోమవారం స్వామివారితో పాటు, భువనేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్చకుడు పవన్‌కుమార్ శర్మ, యోగీశర్మ అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆటో బోల్తా.. యువకుడు మృతి



మృతిచెందిన కృష్ణ భగవాన్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడిన ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం మదనపల్లె మండలం, బసినికొండ సమీపంలోని సయ్యద్‌కార్స్ వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాల్మీకి వీధికి చెందిన నరసయ్య కుమారుడు కృష్ణ భగవాన్ (28)ఆటో నడుపుతూ అదుపు తప్పి ఆటోకింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలుకా పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తూ యువకుడు..



మృతిచెందిన యువకుడు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 29: లక్కిరెడ్డిపల్లె ప్రాంతంలో విద్యుత్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజయ్ (32) ప్రమాదవశాత్తు లైన్లు తగిలి సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పశ్చిమబెంగాల్ రాష్ట్రం పూర్వవర్ధమాన్ జిల్లా రామగోపాల్పూర్‌కు చెందినవాడని, గత కొంతకాలంగా ఓ కాంట్రాక్టర్ కింద లైన్‌మెన్‌గా, సహాయకుడిగా పనిచేస్తున్నాడని, కుర్నూతల మూలపల్లి ప్రాంతంలో విద్యుత్ లైన్లు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగులుకొని మృత్యువాత పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ...



రెడ్డిశేఖర్ మృతదేహం

కలకడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడు రెడ్డిశేఖర్ (19) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు... కోన గ్రామవాసి శివశంకర్ కుమారుడు రెడ్డిశేఖర్ రాయచోటిలోని ఓ కళాశాలలో ఐటీఐ చదువుకుంటున్నాడు. పరీక్షల ఫీజు కోసం తండ్రిని డబ్బులు అడుగగా సర్దుబాటు చేసి పంపుతానని సమాధానం ఇచ్చాడన్నారు. దీంతో మనస్థాపం చెంది 27న ఇంటికి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో వుండగా కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 నుంచి సౌత్ ఇండియా లెవల్ క్యారమ్స్ పోటీలు

నందలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్‌ఇండియా లెవల్ క్యారమ్స్ పోటీలు అక్టోబరు నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సోమవారం మాట్లాడుతూ పోటీలో పాల్గొనదలచిన వారు అక్టోబరు 5వ తేదీ లోపు ఎంట్రీలు పంపాలని తెలిపారు. కార్యమ్స్ పోటీలు(స్ట్రైట్ గేమ్స్) ఉంటాయని తెలియజేశారు. ఎంట్రీలను బీఎస్ శంకర్, ప్రెసిడెంట్ యమ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ నందలూరు, అన్నమయ్య జిల్లా వారికి పంపాలని తెలిపారు. ఈ పోటీల్లో డబుల్స్ విన్నర్స్‌కు రూ.40 వేలు, డబుల్ రన్నర్స్‌కు 25 వేలు, సింగిల్స్ విన్నర్స్‌కు రూ.25 వేలు, సింగిల్ రన్నర్స్‌కు రూ.15 వేలు, డబుల్స్ సెమిఫైనల్ లూజర్సుకు రూ.12 వేలు, సింగిల్ సెమీఫైనల్ లూజర్స్‌కు రూ.8 వేలు, డబుల్ క్వార్టర్ ఫైనల్ లూజర్స్‌కు రూ.12 వేలు, సింగిల్ క్వార్టర్ ఫైనల్ లూజర్స్‌కు రూ.6 వేలు, బెస్ట్ ప్లేయర్ అవార్డుకు రూ.5 వేలు, క్యారమ్స్ పోటీల్లో ఓపెన్ ఫినిషింగ్ చేస్తే రూ.1000 ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు క్రీడాకారులకు భోజన సౌకర్యం కమిటీవారు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. వివరాలకు 7732054403ను సంప్రదించాలని టోర్నమెంట్ నిర్వాహకులు కోరారు.

ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు రాజశేఖర్

చిట్వేలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకుడిగా, ఎన్‌సీసీ అధికారిగా ఉత్తమ సేవలు అందించినందుకు ఉపాధ్యాయుడు పసుపుల రాజశేఖర్‌ను ఆచార్య దేవోభవ జాతీయ పురస్కారం 2025 వరించింది. ఈ మేరకు ఆదివారం బాపట్ల జిల్లా వేటపాలెంలో యువతేజం ట్రస్టు, కలాం విజన్ సంస్థల ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు చీఫ్ సూపరింటెండెంట్ పీవీసీ అంజలికుమారి, సంస్థ ఛైర్మన్ ఎస్.కరీముల్లా, డాక్టర్ నారాయణస్వామి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ బోధన సామాజిక సేవా రంగాలకు చేస్తున్న కృషికి గాను అవార్డు దక్కిందని, ఇది బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు రాజశేఖర్‌ను అభినందించారు.

హరూన్ బజాజ్ మేళాకు విశేష స్పందన

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే హరూన్ బజాజ్ మెగా మేళా అండ్ ఎక్స్ఛేంజ్ ఈ ఏడాది కూడా విపరీతంగా ఆకట్టుకుందని హరూన్ బజాజ్ ఎండీ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ వాహన ప్రదర్శన, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, ఆకర్షణీయమైన డిస్కౌంట్లు, ప్రత్యేక ఫైనాన్స్ సౌకర్యాలు వంటి ఎన్నో అవకాశాలతో ఈ కార్యక్రమం వినియోగదారుల నుంచి విశేష స్పందన పొందిందన్నారు. పాత వాహనాలను మోడరన్ బజాజ్ మోడల్స్‌కి మార్చుకోవాలనుకునే వారికి ఈ మేళా ఒక గొప్ప అవకాశమని, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అందుబాటులోకి తెచ్చిన మోడల్స్, తక్కువ డౌన్‌పేమెంట్‌కి తీసుకునే అవకాశాలు పెద్దఎత్తున ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ మెగా మేళా వినియోగదారుల విశ్వాసానికి అద్దం పడుతూ సక్సెస్ అవుతుందన్నారు. ఈ సారి కూడా అదేస్థాయిలో మద్దతు లభించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.



కస్టమర్‌కు వాహనాన్ని అందిస్తున్న హరూన్ బజాజ్ సంస్థ ప్రతినిధులు

సీతాఫలం సాగు... భలే బాగు...!

- సహజసిద్ధంగా కాసిన కాయలు
- తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి
- పలు పట్టణాలకు తరలింపు
- కూలీలకు దొరుకుతున్న ఉపాధి



బురకాయలకోటలో ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న సీతాఫలం కాయలు



ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎలాంటి రసాయనాలు... పురుగుల మందులు వాడకుండా పండే ఫలం సీతాఫలం. ఎంతో మధురమైన ఈ కాపు ఈ ప్రాంతంలోని అడవులు, కొండలు, గుట్టల్లో స్వచ్ఛమైన వాతావరణంలో సహజ సిద్ధంగా పెరుగుతాయి. రెండు నెలలుగా వర్షాలు బాగా కురవడంతో సీతాఫలం కాయల దిగుబడి బాగా ఉంది. జిల్లాలోనే ములకలచెరువు మండలం బురకాయలకోట సీతాఫలానికి ప్రసిద్ధి గాంచింది. ఇక్కడి నుంచి ప్రతి రోజు మన రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడ సహజసిద్ధంగా కాసే సీతాఫలం కాయలు ఎంతో మధురంగా, రుచిగా ఉండడంతో బాగా డిమాండ్ ఉంటుంది.

నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట, దేవళచెరువు, సోంపాళ్యం, కాలువపల్లె, నల్లొండ, బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్, గట్టు, తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె, ముద్దలదొడ్డి, పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు, బి.కొత్తకోట మండలం బయప్ప గారిపల్లె, ఉలవవారిపల్లె, కురబలకోట మండలాలతో పాటు తదితర గ్రామాల సమీపాల్లో అడవులు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ సీతాఫలం చెట్లు వేలల్లో ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో సీలాఫలం కాయలు కాస్తాయి. ఈ ప్రాంతాల నుంచి కూలీలు కాయలను కోసుకొచ్చి బుర కాయలకోటలో విక్రయానికి తీసుకొస్తారు. అలాగే సత్యసాయి జిల్లా తనకల్లు, నల్లచెరువు, సరి హద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె, చేలూరు తదితర ప్రాంతాల నుంచి కూడా కాయలను కోసుకొచ్చి విక్రయించేందుకు కూలీలు ఇక్కడికి తెస్తున్నారు. ఆగస్టు నుంచి నవంబరు ఆఖరు వరకు సీజన్ నడుస్తుంది. ఇక్కడ కూలీల దగ్గర సీలాఫలం కాయలకు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన కాయలను గ్రేడింగ్ చేసి తెలంగాణ రాష్ట్రం మిరియాలగూడ, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, మిర్యాలగూడ, హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, సింధనూరు, చాయచూర్, గుల్బర్గా, హోస్పేట్, హుబ్లీ, బళ్లారి, దివనగిరి, తమిళనాడు రాష్ట్రం చెన్నై, మదురై, కృష్ణగిరిలతో పాటు మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖ పట్నం, అనంతపురం, రాజమండ్రి, నంద్యాల తదితర పట్టణాలకు, నగరాలకు ఎగుమతి చేసి విక్రయిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు అధికంగా కురవడంతో కొండలు, గుట్టల్లో పచ్చదనం పరుచుకుంది. సీతాఫలం కాయలు కూడా బాగా కాశాయి.

కూలీలకు జీవనోపాధి

ప్రతి ఏడాది సీతాఫలం కాయలతో ఈ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు నుంచి నవంబరు నెల వరకు సీతాఫలం కాయలు కోసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తారు. సీలాఫలం కాయలు కూలీలకు ఎంతో ఆసరాగా ఉంటుంది. ఇక్కడి కూలీలు ప్రతి రోజు ఉదయమే అడవులు, కొండలు, గుట్టలకు వెళ్లి కాయలు సేకరించి సాయంత్రం బురకాయల కోటకు తీసుకొచ్చి వ్యాపారస్థులకు విక్రయిస్తుంటారు. వ్యాపారులు కూలీల వద్ద నాణ్యతను బట్టి ఒక్కో క్రేటును రూ.350 నుంచి రూ.450 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కూలీ ప్రతి రోజు రెండు నుంచి ఐదు క్రేట్ల కాయలు సేకరిస్తారు. ప్రతి ఏడాది సీతాఫలం కాయల సీజన్‌లో బురకాయలకోట కేంద్రంగా భారీగా వ్యాపారం జరుగుతోంది. కూలీల వద్ద కొన్న కాయలను వ్యాపారులు గ్రేడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బయటి ప్రాంతాల్లో క్రేటు సీతాఫలం ధర రూ.700 వరకు పలుకుతోంది. ప్రతి రోజు బురకాయలకోట నుంచి 800-1000 క్రేట్ల వరకు కాయలు ఎగుమతి అవుతున్నాయి.

జీవనోపాధి దొరుకుతోంది

- గోపాలమ్మ, కూలీ, బురకాయలకోట



సీతాఫలం కాయల ద్వారా జీవనోపాధి లభిస్తోంది. మా ఊరికి సమీపంలో ఉన్న కొండలు, గుట్టల్లోకి ప్రతి రోజూ వెళ్లి రెండు నుంచి ఐదు క్రేట్ల కాయలను కోసుకొచ్చి ఆటోలో తీసుకొచ్చి అమ్ముకుంటున్నాం. ప్రతి రోజు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం వస్తోంది. వర్షాలు బాగా కురవడంతో కాయలు బాగా ఉన్నాయి.

గొర్రెలు మేపుకొనేందుకు వెళ్లి కోసుకొస్తాను

- గోపి, రంగనాయనిపల్లె



కొండలు, గుట్టల్లోకి గొర్రెలు మేపుకొనేందుకు వెళ్తాను. అక్కడ సీతాఫలం చెట్లు భారీగా ఉండడంతో గొర్రెలు మేపుతూ సీతాఫలం కాయలు కూడా కోసుకొచ్చి విక్రయిస్తున్నాను. ప్రతి రోజూ రెండు క్రేట్ల కాయలు కోసుకొచ్చి బురకాయలకోటలో అమ్ముతాను. రోజు రూ.700 వరకు ఆదాయం వస్తోంది.

నాలుగున్నరేళ్లలో గుంతలమయం చేశారు

- కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ధ్వజం
- ప్రొటోకాల్ విషయమై వైసీపీ కౌన్సిలర్ల రగడ
- అజెండాలో పలు అంశాలను ఆమోదించని వైసీపీ కౌన్సిలర్లు



కౌన్సిల్‌లో ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ తులసి

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాలుగున్నరేళ్ల మున్సిపల్ కౌన్సిలర్ల పాలనలో మదనపల్లె పట్టణంలో అభివృద్ధి పనులను అటకెక్కించారని, పలు రోడ్లను గుంతలమయం చేశారని టీడీపీ కౌన్సిలర్ తులసి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాల్లో ఛైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత కౌన్సిలర్ తులసి మాట్లాడుతూ పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపితే, ఛైర్‌పర్సన్‌తో పాటు, వైసీపీ కౌన్సిలర్లు ఈ పనులను అజెండాలో పెట్టకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. అధికారం వుంది కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తప్పుపట్టారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, అభివృద్ధి పనులు చేయించడంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కాని ఆయా వార్డుల్లో కౌన్సిలర్లకు ప్రొటోకాల్ విషయంలో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీరిపై కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో 11,800 విద్యుత్ వీధిదీపాలు వుంటే కేవలం నలుగురు లైటింగ్‌మెన్‌లు మాత్రమే పనిచేస్తున్నారని, వీరి సంఖ్య 30కు పెంచాలని ఛైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ కరీముల్లా మాట్లాడుతూ 35 వార్డుల నుంచి ప్రతి ఏటా రూ.21కోట్లు పన్నుల రూపంలో నిధులు వస్తుంటే కేవలం కొన్ని వార్డులకే ఈ నిధులు కేటాయించడంపై ఆక్షేపించారు. కౌన్సిలర్ ప్రసాదబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాలకు రాజ్యాంగం ప్రకారం నిధులు కేటాయించాల్సి వుండగా అది జరగడం లేదని విమర్శించారు. కోమటివానిచెరువు వద్ద మున్సిపల్ స్థలం కబ్జాకు గురవుతోందని, దాన్ని కాపాడాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లు బీఏ ఖాజా, అర్జున తదితరులు పలు అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటిపై ఛైర్‌పర్సన్ స్పందిస్తూ సమావేశంలో లేవనెత్తిన అంశాలపై చర్చించి వచ్చే సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కాగా ఛైర్‌పర్సన్ మనూజ తీర్మానించి రూపొందించిన అజెండాలోని కొన్ని అంశాలను మెజారిటీ వైసీపీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తూ ఆమోదించలేదు. సమావేశంలో వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు ఫర్హానా, సరిత, గిరిజ, రాజేష్, మున్సిపల్ మేనేజర్ మనోహర్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో పట్టుబడ్డ నిందితుడు

- 95 గ్రాముల బంగారం, పల్సర్‌బైకు స్వాధీనం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ

రాజంపేటటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వత్తలూరు వడ్డిపల్లెకు చెందిన మహిళపై దాడిచేసి పరారైన నిందితున్ని పుల్లంపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఈ నెల 10న వత్తలూరు వడ్డిపల్లె గ్రామానికి చెందిన ఏరుకాల్వ రమాదేవిపై దాడిచేసి పరారైన పీలేరు మండలం బోడుమల్లివారిపల్లెకు చెందిన వేముల విశ్వనాధం అలియాస్ ఊసోడును పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద సోమవారం అరెస్ట్ చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.9.50 లక్షలు విలువ చేసే 93.030 గ్రాముల బంగారం, పల్సర్ బైకు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చిత్తూరు జిల్లా సదుం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు, పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిని పట్టుకుని బంగారం రికవరీ చేసినందుకు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, పుల్లంపేట ఎస్‌ఐ శివకుమార్, పెనగలూరు ఎస్‌ఐలను అడిషనల్ ఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే అభినందించారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'



మాట్లాడుతున్న అశోక్‌బాబు

నందలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు అన్నారు. సోమవారం నందలూరుకు చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు దళిత నాయకులు స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో అశోక్‌బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలు అన్ని విధాలుగా నష్టపోతారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు అనూహ్య స్పందన వస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, ఆర్ముగం విశ్వనాథ్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, నాయనపల్లి ఆదినారాయణ, తుమ్మది శివకుమార్, గుడిసె సుబ్రమణ్యం, ఎముక దుర్గయ్య, శివ నరసింహులు, సురేష్, నాగభూషణం, నాగరాజు, డిస్కో మణి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కలకడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంగా ఘర్షణ పడ్డ ఇరు వర్గాల్లోని నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బాలయ్యగారిపల్లి పంచాయతీ ఝరిగడ్డ వాసులైన తిరుమలేశు, వెంకటరాయుడుకు భూ తగదాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో భూమి వద్ద ఇరువర్గాలు గొడవ పడి కర్రలతో దాడి చేసుకున్నట్లు తెలిపారు. ఘటనలో ఓ వర్గంలోని తిరుమలేశు, చంద్రకళ మరో వర్గంలోని వెంకటరాయుడు, సరస్వతిలకు గాయాలైనట్లు చెప్పారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్



గాలివీడులో గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గాలివీడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టుగా సాగుతున్న గంజాయి బ్యాచ్‌పై పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం గాలివీడు పట్టణంలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయమై సీఐ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా రెక్కీ నిర్వహించిన అనంతరం పక్కా సమాచారంతో చిలకలూరిపేట వద్ద గుడిసెల్లో నివాసం ఉంటూ గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించామని, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని ఫోన్ ద్వారా గంజాయి క్రయ విక్రయాలు సాగిస్తున్న మరో ఇద్దరు యువకులను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ముగ్గురిని అదుపులోకి తీసుకుని లక్కిరెడ్డిపల్లెకు తరలించి విచారిస్తున్నామన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి మూలాలను సమూలంగా కూకటివేళ్లతో పెకిలించి వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపిక



సౌత్‌జోన్ కబడ్డీకి ఎంపికైన విద్యార్థిని పెంచలయ్య

రైల్వేకోడూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిడిగ్రీ కళాశాలలో బీకాం 3వ సంవత్సరం చదువుతున్న బోయ శివకుమార్ సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ ఎంపికలో తమ కళాశాల విద్యార్థి విశేషంగా ప్రతిభను కనబరిచాడని తెలిపారు. సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు త్వరలో కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్శిటీలో జరగనున్నాయని తెలిపారు. సౌత్‌జోన్ పోటీల్లో కూడా తమ విద్యార్థి రాణించాలని ఆయన అభినందించారు.

టైర్ పేలి అరటికాయల వాహనం బోల్తా



బోల్తా పడ్డ అరటికాయల వాహనం

ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): టైర్ పగిలి అరటి కాయల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు అరటి కాయలు తీసుకెళ్తున్న బొలేరో వాహనం సోమవారం ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని సెంట్రల్ స్కూల్ వద్దకు రాగానే టైరు పగిలింది. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పొలాల్లోనే వదిలేశారు...!

- కోత దశకు చేరిన ఉల్లి
- రేటు లేక రైతు కంట తడి



చల్లబసాయిపల్లెలో తొలగించిన ఉల్లి పంటను పొలంలోనే వదిలేసిన దృశ్యం

దువ్వూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. అష్టకష్టాలకు ఓర్చి పంట సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక రైతులు కంటతడి పెడుతున్నారు. ఇప్పుడిప్పుడే పంట కోత దశకు చేరుకుంటోంది. ధర లేకపోవడంతో పండిన పంటను కొనుగోలు చేసే వారు లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

దువ్వూరు మండలంలో పెద్దబళ్లారితోపాటు కేపీ ఉల్లి పంటను రైతులు విరివిగా సాగు చేస్తారు. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో గుడిపాడు, దువ్వూరు, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, దాసరిపల్లి, నీలాపురం, మదిరేపల్లె, చిన్నసింగనపల్లె, రామాపురం, మనేరాంపల్లె ప్రాంతాల్లో పెద్దబళ్లారి రకం ఉల్లి సాగు చేశారు. మండలంలో 1200 ఎకరాల మేరకు ఉల్లి సాగైందని వ్యవసాయశాఖ తెలుపుతోంది. ముఖ్యంగా సాగుకు ఎకరాకు రూ.60 వేలు దాకా పెట్టుబడుల కింద ఖర్చు చేశారు. మధ్యలో అకాల వర్షాలు పంటను దెబ్బతీస్తూ వచ్చాయి. అవాంతరాలను ఎదుర్కొని ఎట్టకేలకు దిగుబడులు చేతికందుతున్నాయి. ఈ సమయంలో ధర పతనమై కొనుగోదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఏడాది క్వింటా రూ.3 వేలు ధర ఉండగా, ఈ ఏడాది రూ.600 నుంచి 700 కూడా లేదు. ఇక ప్రభుత్వం రూ.1200లతో కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ అమలు కావడం లేదు. దీంతో పంటను ఒడిపేందుకు రైతులు తటపటాయిస్తున్నారు. కొందరు రైతులు మాత్రం అక్కడక్కడ పంటను తొలగించారు.

వర్షాలకు పొలంలోనే...

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా.. అసలే ఉల్లికి గిట్టుబాటు ధర లేదని ఆందోళనలో ఉన్న రైతులను వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. ఉల్లి పంటను తొలగించాక వర్షం పడటంతో గడ్డలను వేరు చేయకుండా పొలంలో అలాగే వదిలేశారు. ధర లేకపోవడంతో ఖర్చులు నెత్తికొస్తాయనే భయంతో వదిలేశారు. కాగా, మరో పది రోజుల్లో మరికొంత మంది రైతులు పంటను ఒడిపేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉల్లి కొనుగోలు కేంద్రం వైపు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే బాసటగా ఉంటుందని... ఈదిశగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకోవాలని సంబంధిత రైతులు కోరుతున్నారు.

వాతావరణం అనుకూలించలేదు



నేను రెండు ఎకరాల్లో పెద్దబళ్లారి ఉల్లి వేశాను. వాతావరణం అనుకూలించక పోవడంతో పంట తీసి పొలంలోనే వదిలేశాను. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి అయింది. రూ.80వేలు నష్టపోయాను. పంట తొలగించాలంటే నాతోటి రైతులు భయపడుతున్నారు.

- రుద్రారెడ్డి, రైతు, చల్లబసాయిపల్లె, దువ్వూరు మండలం

అర్ధరాత్రి తాగి వీరంగం... నలుగురు యువకులపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో శనివారం అర్ధరాత్రి తాగి వీరంగం చేసిన నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు యువకులు తాగి అల్లరి చేస్తుండగా కానిస్టేబుల్ మందలించడంతో గొడవకు దిగారు. దీంతో కానిస్టేబుల్ బ్లూకోల్ట్ పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో వారు నలుగురు యువకులను టూటౌన్ పోలీసు స్టేషనుకు తీసు కెళ్లారు. సీఐ సదాశివయ్య వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సెల్‌ఫోన్లు తీసు కొని అడ్రస్సులు, సంతకాలు తీసుకొని ఇంటికి పంపారు. ఈ విషయం ఎస్పీ విశ్వనాథ్ దృష్టికి వెళ్లింది. ఆయనే స్వయంగా సీఐకి ఫోన్ చేసి జరిగిన సంఘటనపై వివరణ కోరారు. అనంతరం ఇలాంటి ఘట నలను ఉపేక్షించవద్దని తెలిపారు. దీంతో నలుగురిని విచారించగా వీరి లో పిట్లా వెంకటచరణ్, కాటం సాయి తేజపై పలు స్టేషన్లలో క్రికెట్ బెట్టింగ్, జూదం కేసులు వున్నాయి, కాటం వీరేంద్రనాథ్, మరో యువ కుడు మహేష్‌పై ఒక కేసు వుంది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదాశివయ్య తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన ఇద్దరిపై..

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పనిచేస్తున్న మండల ఈవోపీఆర్డీ రామాంజనేయరెడ్డి రెండు రోజుల క్రితం రాత్రివేళ బార్‌లో ఉండగా ఎస్సీ జన సంఘం అధ్యక్షుడు పెద్దిరాజు, దాసరి శివక్రిష్ణ అనే వ్యక్తులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. పెద్దిరాజు కొత్తపల్లెలో కాలువ ఆక్రమణపై ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుపై చర్యలు తీసుకోకుండా క్లోజ్ చేస్తావా అంటూ కార్యదర్శి రామాంజనేయరెడ్డిని దుర్భాషలాడుతూ దాడి చేశా రు. పంచాయతీ కార్యాలయానికి వచ్చి మాట్లాడమని, ప్రైవేటు ప్రదే శంలో ఉన్నపుడు అడిగితే ఏం సమాధానం చెబుతామని చెప్పినా విన కుండా దాడి చేశారని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో రామాజంనేయ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెద్దిరాజు, దాసరి శివక్రిష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదాశివయ్య తెలిపారు.

పాము కాటుకు వివాహిత మృతి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యు.వెంకటాపురం గ్రామానికి చెందిన సుంకన్నగారి సువర్ణ (28) అనే మహిళ పాముకాటుకు మృతి చెందింది. శనివారం తన పొలం వద్ద ఉన్న గడ్డిని గొర్రె పిల్లల కోసం కోస్తుండగా గడ్డిలో ఉన్న పాము కాటు వేసింది. వెంటనే చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు.

ఆలయ హుండీలో చోరీ

మైలవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మర నంద్యాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుడి తాళం తీసి ఆలయ హుండీలో ఉన్న నగదు చోరీ చేశారు. సోమవారం ఉదయం ఆలయ ధర్మకర్త నరసింహులు గుడిలోకి వెళ్లి చూడగా హుండీకి ఉన్న తాళం తీసి అందులో ఉన్న దాదాపు రూ.6వేలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



మొబైల్ ఫోన్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న పోలీసులు

కడప క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై తనకు దొరికిన ఐఫోన్‌ను వెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి అప్పగించి ఓ వ్యక్తి తన నిజాయితీని నిరూపించుకున్నాడు. వివరాలిలా.. చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన బయనబోయిన కిరణ్‌కుమారి ఆదివారం బట్టలు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి షాపింగ్ మాల్ వెళుతుండగా తన రూ.80వేలు విలువ చేసే ఐఫోన్ పోగొట్టు కుంది. ఆమె వెంటనే చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే క్రమంలో ఆర్టీసీ కాలనీకి చెందిన ముత్యాలపాడు శ్రీనివాసులుకు బ్రహ్మయ్య షెడ్డు వద్ద మొబైల్ ఫోను దొరకగా ఆయన స్టేషన్‌కు వచ్చి సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. దీంతో శ్రీరా ములును పోలీసులు అభినందించారు. సోమవారం బాధితురాలిని పిలిపించి ఫోన్‌ను అప్పగించారు. దీంతో బాధితురాలు శ్రీరాములుకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

స్వర్ణకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు షాపుల్లో పనిచేసే కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో అయిదు వేల మంది బంగారు పనిచేసే కార్మికులు ఉన్నారని, ఇటీవల కాలంలో బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోవడం, అ కార్పొరేట్ షాపింగ్ మాల్స్ రావడంతో కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. దీంతో కుటుంబ పోషణ కోసం కార్మికులు వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో శేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలిండియా చిల్డ్రన్ ఫెస్టివల్

- అలరించిన నృత్య ప్రదర్శనలు
- బహుమతులు ప్రదానం





ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, శశిభూషణ్‌రెడ్డి, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీలో ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆలిండియా స్కూల్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డిలు హాజరయ్యారు. నాలుగురోజుల పాటు యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ (యుఎస్‌ఓ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుంచి దాదాపు 150 మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై వారివారి సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెబుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. నృత్య ప్రదర్శన, పెయిటింగ్, వక్తృత్వ పోటీలు, జనరల్ క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డిలు మాట్లాడుతూ భిన్న సంస్కృతులను ఒక్కచోటకు చేర్చి తమ సంప్రదాయాలను తెలియజెప్పే కార్యక్రమాలను నిర్వహిస్తున్న యూఎస్‌ఓ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. పలు రాష్ట్రాలలోని సంస్కృతులు, సంప్రదాయలు కలిగిన విద్యార్థులు ఒకే వేదికపై వారిలోని సృజనాత్మకను వెలికితీసి, నాణ్యమైన విద్య అందడం కోసం యూఎస్‌ఓ కృషి మరువలేనిదన్నారు. అలాంటి యూఎస్‌ఓ సంస్థ పులివెందులలో కార్యక్రమం నిర్వహించడం తమకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పులివెందులలో మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యూఎస్‌ఓ సెక్రటరీ జనరల్ నీనాజైన్, వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ బూమ్రా, నేషనల్‌కౌన్సిల్ మెంబర్ భానుప్రకాష్, బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి వాజ్‌పేయి, పులివెందుల మండల అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని జిల్లా మలేరియా అధికారి మనోరమ ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న ఫీవర్ సర్వే, లార్వా సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలు తెలుసుకున్నారు. దోమల వల్ల ప్రబలే వ్యాధులను ప్రజలకు వివరించి వారికి అవగాహన పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె ప్రజలకు సూచనలిస్తూ ఇళ్లలో, పరిసరాల్లో శుభ్రత పాటించి, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయిద్దీన్, సబ్‌యూ నిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలని సోమవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి నేషనల్ మజ్దూర్ యూనియన్ (యూనిటీ)కార్మిక నేతలు కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు బ్రహ్మం, రీజినల్ ఛైర్మన్ శేషన్న మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు రూట్‌లో తిప్పుతున్న నాన్‌స్టాప్ బస్సులను పల్లె వెలుగు బస్సులుగా మార్చి అటు ప్రయాణికులకు, ఇటు ఉద్యోగులకు సమస్యలు లేకుండా చూడాలని వారు కోరారు. ఇందుకు ఆయన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రీజినల్ కార్యదర్శి సుధాకర్, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎంవల్లితదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ తెలిపారు. జమ్మలమడుగు సబ్‌జైలును సోమవారం సీనియర్ సివిల్‌జడ్జి తనిఖీ చేశారు. ముందుగా సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. అక్కడున్న వసతులను గురించి ఆరా తీశారు. సబ్‌జైలులో లీగల్ ఎయిడ్ క్లీనిక్‌లను తనిఖీ చేసి, అక్కడున్న రికార్డులను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి వారి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అలాగే కమలాపురం, ప్రొద్దుటూరు జైళ్లను తనిఖీ చేసి లీగల్‌ఎయిడ్ క్లీనిక్‌ల ప్రాధాన్యతను తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్‌జైళ్ల సూపరింటెండెంట్లు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించాలని కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నుంచి సిబ్బంది తమ విధులను జాగ్రత్తగా, బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. సోమవారం కడప నగరం యూటీఎఫ్ కార్యాలయంలో కేజీబీవీలో పనిచేస్తున్న సిబ్బందితో సమా వేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. తప్పనిసరిగా సిబ్బంది సమయం పాటించాలన్నారు. ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడు తూ పాఠశాలల శుభ్రత, స్వచ్ఛతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట మనుషులు, వాచ్ ఉమెన్, ఏఎన్ఎంలు, అటెండర్లు, స్వీప ర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె నోటీసు



ఆర్టీపీపీ సీఈకి సమ్మె పత్రాన్ని ఇస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడం లేదంటూ విద్యుత్ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారు. సెంట్రల్ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఆర్టీపీపీ రిజినల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీపీపీ సీఈని కలిసి వారు సమ్మె నోటీసును ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు అనేక రూపాల్లో ఆందోళన చేసినా.. ప్రభుత్వం నుంచి కనీస స్పందనలేదన్నారు. 1999 నుంచి 2004 మధ్యలో ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికు లకు థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా విద్యుత్ సంస్థలే జీతాలు చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పలు దపాలుగా ఆందోళన చేసినప్పటికీ ఇప్పటి వరకు స్పందిం చలేదని విమర్శించారు. అక్టోబరు 6న విశాఖలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా, 8న తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన, 13న చలో విజయవాడ పేరుతో భారీ ఆందోళన, 14న అన్ని సంస్థల్లో వర్క్ టు రూల్ కార్యక్ర మం నిర్వహిస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించ కపోతే అక్టోబర్ 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించారు.

రైల్వే ట్రాక్షన్ అప్‌గ్రేడ్ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో గుంతకల్-కడప మధ్య భూసేకరణ

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే పరిధిలో రైల్వే ట్రాక్షన్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 2 (37ఎ) ప్రకారం 1.25 కేవీ నుంచి 2.25 కెవీ విద్యుత్ ట్రాక్షన్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ పనులను ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటిస్తూ కేంద్రం అధికారిక నోటిఫికేషన్ ఈనెల 24వ తేదీ జారీ చేసినట్లు ప్రాజెక్టు అధికారి అమిత్ అగర్వాల్ తెలిపారు. ఈప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా 3000 మెట్రిక్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని సాధించాలన్న దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ముద్దనూరు, కడప మధ్య భూసేకరణ చేపట్టనున్నారు. ఈ భూసేకరణ ప్రజాప్రయోజనం కోసం జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జరుగుతుందని తెలిపారు.

సమ్మెలో పాల్గొన్న డాక్టర్లు



చాపాడు ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

చాపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ కోర్కెలు నెరవేరేవరకు పలు రకాల పద్ధతుల్లో నిరసనలు తెలుపుతామని డాక్టర్లు పేర్కొన్నా రు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, శ్రీవాణి, కావ్య మాధురి సమ్మెలో పాల్గొన్నారు. డాక్టర్లు ఆస్పత్రులకు వచ్చి రోగులకు పరీక్షలు చేయకుండా విధులకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వం పీజీ కాలేజీల్లో అడ్మిషన్ల విషయమై 50 శాతం కోటాను రద్దు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. కాగా, ఆస్పత్రిలో ఉన్న స్టాఫ్‌నర్సులు భాగ్యవతి, సునీతలు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యేలు



ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు ఆది, పుట్టా

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నచికేత్ విశ్వనాథ్‌ను సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎస్పీతో స్థానిక సమస్యలపై మాట్లాడినట్లుగా తెలిసింది.

రాజంపేట సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి

రాజంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్క రించాలని టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గ్రామీణ మాజీ అధ్య క్షుడు బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా, సీనియర్ నాయకులు మారాతు సుబ్బనరసయ్య సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావనను కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సబ్ కలెక్టర్‌ను కలిసి రోడ్లు, ట్రాఫిక్ సమస్యలను వివరించారు. రైల్వే అండర్ బ్రిడ్జి లేక వేలాది మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. రాజంపేట ఆఫీసర్స్ క్లబ్‌లో ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేసి యువతను క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు కేఎల్ నరసింహ, చల్లా సుధాకర్ లయన్స్‌క్లబ్ జోన్ ఛైర్మన్ పెనిగలపాటి చంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లిగా..


సరస్వతీదేవి అలంకరణలో చౌడేశ్వరీ మాత

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీదేవి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం సరస్వతీదేవి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ పురాణం చంద్రశేఖర్, బండి పవన్‌కుమార్, రామిశెట్టి రత్నమయ్య, ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, ఉప్పు రామచంద్ర, నీలకంఠ, కొరమట్ల నాగరాజ, ఆర్‌కే మోహన్, కమలమరి కృష్ణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి ఆంజనేయులు, శీలం రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కోర్టులో గంగమ్మకు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు కరుణాకర్ నాయుడు, ట్రేజరర్ మార్వారి మహేష్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. స్థానిక వాసవీ భవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాలను మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ట్రెజరర్ సూరే గిరిధర్ పర్యవేక్షించారు. దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక దేవతానగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో, దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈవో రమణ, సిబ్బంది అంకన్న, రాజశేఖర్‌లతోపాటు మాజీ ఆలయకమిటీ అధ్యక్షుడు బిజేపాండు, మార్వారి సుధాకర్ నాయుడు, విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అలాగే బుగ్గవంక కాలువ సమీపంలోని బాట గంగమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకారం నిర్వహించారు. కమ్మగడ్డవీధిలో నాదేళ్ల అరుణ్‌తేజ్ బృంధం, నాగిరెడ్డి వీధిలో విజేంద్ర, దానేశ్, జశ్వంత్‌లు, ఈశ్వరమ్మకాలనీలో, నీరుగట్టువారిపల్లెలోని తారక లేవుట్లో టీడీపీ యువనాయకుడు ప్రభు గౌడ్, పరిమిళ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కనకదుర్గగమ్మ అమ్మవారిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

పీలేరు: సరస్వతి దేవి అలంకారంలో బండ్లవంక నడివీధి గంగమ్మ



గుర్రంకొండలో ..



వాల్మీకిపురంలో..



కలికిరిలో..



ములకలచెరువులో..



సరస్వతీ నమస్తుభ్యం..

- వైభవంగా దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాలు
- సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

పీలేరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): "సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణీ, విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా" అంటూ చదువుల తల్లిగా అవతరించిన అమ్మవారిని మండలంలోని చిన్నారులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పూజించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం రౌద్రాల అంకాళమ్మ, ఇందిరమ్మ కాలనీ దిన్ని గంగమ్మ, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ, మోడల్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా తలపుల సమీపంలోని ఉలవల గంగమ్మ, తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి దేవీ, అగ్రహారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాల కమిటీ చైర్మన్‌లు కె.రామకృష్ణారెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణా రెడ్డి, రామిరెడ్డి, వెంకటమ్మ, శేఖర, ఈవో మంజుల, సభ్యులు చంద్రారెడ్డి, వంశీ, మదనమోహన రెడ్డి, బాబు రెడ్డి, రఘునాథ్, షామియాన జయన్న, భాస్కర రెడ్డి, అర్చకులు చంద్రశేఖర శర్మ, ఆంజనేయులు, భరత్ స్వామి, గణేశ్, మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

మహా సరస్వతిదేవిగా రెడ్డెమ్మ

గుర్రంకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సంతాన లక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మ అమ్మవారు సోమవారం మహా సరస్వతిదేవిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చన, పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే గుర్రంకొండ పోలేరమ్మ అమ్మవారు, తరిగొండ వాసవీ మాత సరస్వతిదేవి అవతారంలో కరుణించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని నల్లవీర గంగాభవాని, కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి, బజారువీధిలోని వాసవి అమ్మవారు, వాల్మీకినగర్‌లోని బోయకొండ గంగమ్మ, గండబోయనపల్లె కోటలో వెలసిన సత్యమ్మతల్లి, చింతపర్తి కన్యకాపరమేశ్వరి, గొల్లపల్లె విరూపాక్షమ్మ సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నవితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాలలో ఆలయాల ధర్మకర్తలు మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, పులి సత్యారెడ్డి, కువైట్ శంకరాచారి, తబ్జూల సతీష్, కాంతరాజుశెట్టి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రామ దేవత యల్లమ్మ సోమవారం సరస్వతీదేవి అవతారంలో సాక్షాత్కరించింది. ముందుగా అమ్మవారిని అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎం రోడ్డులో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు సోమవారం శ్రీ సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోవ రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచహారతి, సప్తహారతి, నక్షత్రహారతిని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం దుర్గామాతను కొలువుదీర్చి కుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


పెద్దతిప్పసముద్రంలో..

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలోని కోదండ రామాలయం, శివాలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు ఎనిమిదో రోజైన సోమవారం మహిషాసురమర్ధిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మహేష్ అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాయ, కర్పురాలు సమర్పించి పూజలు చేశారు.


తంబళ్లపల్లెలో..

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అట్టహాసంగా నిర్వహిస్తున్న దసరా నవరాత్రి వేడుకలలో భాగంగా సోమవారం సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హాజరైన మహిళలకు పసుపు కుంకుమ, గాజులను దుర్గానవరాత్రి ఉత్సవకమిటీ సభ్యులు అందించారు.

కురబలకోటలో..

కురబలకోట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు సోమవారం సరస్వతి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాగరాజ గుప్త, రామకృష్ణ, బాలకృష్ణ సేతు మాధవ్, అమర్‌నాథ్, మారుతీ కుమార్, రామ్మోహన్, రాధారాణి, పుష్పలత, సరళ తదితరులు పాల్గొన్నారు.


కురబలకోటలో..



రాజరాజేశ్వరిదేవిగా చౌడేశ్వరిదేవి



కలకడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చౌడేశ్వరిదేవి ఆలయాలలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. పలువురు అమ్మవారికి బోనాలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అర్ధనారీశ్వరిదేవి అలంకరణలో మాతమ్మ

నిమ్మనపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నవరాత్రి దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని స్థానిక పెద్ద దళితవాడలో వెలసిన మాతమ్మ అర్ధనారీశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని రెండు రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే ఈ ఏడాది ఆలయం ముందు అమ్మవారి ఉత్సవవిగ్రహం ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యంలో భక్తులు తరలివచ్చారు.

దళితవాడల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దళితవాడల్లో నెలకొన్న సమస్యలు నెలకు ఒకటి తీర్చినా ఇప్పటికి ఉండేవి కావని, వెంటనే దళితవాడల సమస్యలను పరిష్కరించాలని దళిత నాయకులు మునిరత్నం, సురేంద్ర కోరారు. సోమవారం కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లిలో తహసీల్దార్ తపస్విని ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఒక్క ముష్టూరు పంచాయతీలోనే హీనజాతి భూములు దాదాపు 250ఎకరాలు వున్నాయని, గతంలో పట్టాలు ఇచ్చినా అధికారులు ఆన్‌లైన్ చేయలేదన్నారు. ఈ క్రమంలో కొంతమంది భూస్వాములు దళితులను మభ్యపెట్టి వారి భూములను లాక్కొన్నారని ఆరోపించారు. కాగా పలు గ్రామాల్లో మురుగునీటి కాలువలు, విద్యుత్‌దీపాలు వంటి సౌకర్యాలు లేవని, బర్రెల గ్రౌండ్, శ్మశాన వాటికలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని వాపోయారు. అనంతనం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెల ఒక గ్రామంలో సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించి దళితవాడల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృషికి తీసుకెళుతున్నామని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత వరకు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, ఆర్ఐ రమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, సర్వేయర్ గోపి పాల్గొన్నారు.

జీఎస్టీని సద్వినియోగం చేసుకోవాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా జీఎస్టీని తగ్గించిందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. సోమవారం జీఎస్టీ ద్వారా తగ్గిన వస్తువులను ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదల తర్వాత చాలా రకాల వస్తువుల ధరల్లో మార్పు లు వచ్చాయన్నారు. వీటిలో ఎక్కువగా నిత్యావసర సరుకులు చాలా చౌకగా వస్తున్నట్లు తెలిపారు. వ్యాపారస్థులు రేట్లు తగ్గించకుండా వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మురళి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు చేయూత

కురబలకోట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు చేయూతనందిస్తూ ప్రజల ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో గంగయ్య తెలిపారు. సోమవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో సిబ్బంది ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు సమాచారం అందివాలన్నారు. అంతేకాకుండా ప్రజలు కొనుగోలు చేసే వస్తువులు తగ్గింపు ధరలకు అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటుగా వాటిపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూదేవి, ఎంఈవో ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ

పెద్దమండ్యం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్‌టీ తగ్గింపుపై సోమవారం జీఎస్టీ సిబ్బంది, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కలిచెర్లలో థ్యాంక్యూ ఎన్‌డీఏ ప్రభుత్వం అన్న ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నౌజీయాబేగం మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలకు వ్యవసాయం, విద్యా, వ్యాపార రంగానికి సూపర్‌గిఫ్ట్ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరీశ్, తదితరులు పాలొన్నారు.

జాప్యం జరిగితే డీలర్‌పై చర్యలు

కలికిరి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సరుకులు పంపిణీ చేయడంలో అలసత్వం వహించే డీలర్లపైన చర్యలుంటాయని డిప్యూటీ తహసీల్దారు సయ్యద్ హెచ్చరించారు. సోమవారం కలికిరి పంచాయతీ మాదిగపల్లెలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో సరుకుల పంపిణీ, పింఛన్ల మంజూరు, విద్యుత్, తాగునీటి తదితర సమస్యలను స్థానికులు ప్రస్తావించినప్పుడు అధికారులు స్పందించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అర్హులకు పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. పంటల బీమా, ఎరువులు, విత్తనాల పంపిణీ తదితర వాటిపై ఎంఏవో హేమలత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రియాజుద్దీన్, వీఆర్వో గౌరి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసవర్మ, గడ్డం ఏసురాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం వచ్చే చర్యలు చేపట్టాలి

ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చే చర్యలు చేపట్టాలని ఎంపీడీవో హరినారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంలో వారపు సంత నిర్వహించుకుంటే ఆదాయం వస్తుందన్నారు. అనంతరం పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మోహనప్రతాప్, ఎంఈవో వెంటకరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దినేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ చక్రపాణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.37లక్షలతో మురుగునీటి కాలువలు

- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో మురుగునీటి కాలువ నిర్మాణానికి రూ.37లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక రెడ్డీస్‌కాలనీలో మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జునగాంధీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధిలకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీకేఎం ఉడా, 15టీఎఫ్‌సీ నిధులతో ఈ పనులు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం పట్టణంతో పాటు మండలంలో ఐదుగురికి మంజూరైన రూ.5లక్షల సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు గంగారపు రామ్మూర్తినాయుడు, కమలామర్రి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నరసాపురంలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

రామసముద్రం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రామసముద్రం మండలంలోని నరసాపురం, రాగిమాకులపల్లె కొత్తూరు, గోసువారిపల్లె నాగనపల్లి, తమకనపల్లి, దాసిరెడ్డిపల్లె, యల్లంపల్లె, చిన్నపల్లి, చింపిరిపల్లి, తదితర 13గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగద్గీత, ఆధ్యాత్మిక గ్రంధాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంధం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని వివరిస్తుందని, ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత తెలుసుకోవాలన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు సభ్యులు జి.ప్రసాద్, సుధాకర్, పెంచల రత్నం, నాగమ్మ, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాలి

పెద్దమండ్యం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో వండిన ఆహారం తినడం అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నౌజీయాబేగం తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిరుధాన్యాల పోషక విలువలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు, వంటకాలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిల్లలు పెరుగుదలను ప్రతి నెల గమనించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నరసింహులు, ఏపీవో సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిరుధాన్యాల ప్రదర్శన లో అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు

'ఆత్మగౌరవం దెబ్బ తినే పనులు చేయలేకున్నాం'

పీలేరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్న ఇంటింటి ప్రచారం వంటి పనులు తాము చేయలేకున్నామని పీలేరులోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. గతంలో వలంటీర్లు చేస్తున్న పనులను తమకు అప్పగించవద్దని సోమవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ ఇంటింటి ప్రచార బాధ్యతల నుంచి తమను తప్పించాలని గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ఇంతవరకు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తహసీల్దారుతో పాటు ఎంపీడీవో రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు జ్ఞానశేఖర్, శివాజీ, షబానా తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారుకు డిమాండ్ల పత్రం అందిస్తున్నగ్రామ కార్యదర్శులు

విలువైన పంచాయతీ స్థలాన్ని కాపాడాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ పరిధిలోని రూ.కోట్ల విలువైన పంచాయతీ స్థలాన్ని కబ్జాకు గురికాకుండా కాపాడాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం రాయచోటిలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. గతంలో లేఅవుట్ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి కేటాయించిన స్థలం కోర్టు వివాదంలో వుండగా, పంచాయతీ అధికారులు కోర్టుకు సరైన పత్రాలు సమర్పించడంలో విఫలమయ్యారని, దీంతో ఆ స్థలాన్ని కొందరు ఆధీనంలోకి తీసుకున్నారన్నారు. దీనిపై కోర్టులో మరో అప్పీలు వేసి గ్రామ పంచాయతీ స్థలాన్ని కాపాడాలని కోరారు. అనంతరం ఎస్పీ ధీరజ్ కనుబిల్లిని బీవైఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పునీత్

రీసర్వే సమస్యలను పరిష్కరించాలని వినతి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు గత ప్రభుత్వం రీసర్వేల పేరుతో తమ భూముల వివరాలన్నీ తప్పుల తడకగా నమోదు చేశారని, ఇప్పుడు కూడా కొందరు సర్వేయర్లు అవే తప్పులు చేసి రైతులకు సమస్యలు సృష్టిస్తున్నారని, మీరైనా ఈ సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణిని పలువురు రైతులు కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని రైతులు ఆర్‌వోఆర్ అప్పీలు, మ్యుటేషన్లు, భూ వివాదాలపైనే ఎక్కువగా అర్జీలు అందజేశారు. వీటన్నింటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.


సబ్‌కలెక్టర్ కళ్యాణికి అర్జీలు అందిస్తున్న ప్రజలు

తాగునీటి కోసం మహిళల నిరసన

బి.కొత్తకోట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బాబాటాకీస్ ప్రాంతంలో తాగునీటి అవసరాలను పట్టించుకోకపోవడంతో పాటు అడిగిన దానికి తగిన సమాచారం కూడా ఇవ్వకపోవడంపై సోమవారం పలువురు మహిళలు ఖాళీబిందెలతో నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ విషయమై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ ప్రాంత నీటిసమస్యను పరిష్కరించాలని, అంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలద్వారా నీటివసతి కల్పించాలని కోరారు. నీటిసమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ పల్లవి తెలిపారు.